UNIVERSAL LIBRARY
OU_206122
UNIVERSAL LIBRARY

OUP—391—29-4-72—10,000.

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T81 L19S Accession No. 2G

Author Lakshmikantham, P

Title sources of prabhavati pradyumnam. 1933.

This book should be returned on or before the date last marked below.

ORIENTAL RESEARCH INSTITUTE PUBLICATIONS.

TELUGU SERIES, No. II.

# THE SOURCES OF PRABHĀVATĪ PRADYUMNAM

AN ESSAY

BY

P. LAKSHMIKANTHAM, M. A.,
*Lecturer in Telugu, College of Arts, Andhra University.*

*(Formerly Fellow in Telugu, Institute of Oriental Research, University of Madras.)*

Post Graduate Library
*College of Arts & Commerce. O. U*

UNIVERSITY OF MADRAS.

1933

Price Re. 0-8-0.

# FOREWORD.

This is a short critique written by Mr. P. Lakshmikantham, M. A., a Fellow of the Telugu Department of the Oriental Research Institute, during the period 1927–1931, and now Telugu Lecturer in the Andhra University College of Arts, Waltair. The discovery of a Drama in Sanskrit called 'PRADYUMNĀBHYUDAYAM,' written by Ravivarmabhupa, suggested to him the idea of dealing critically with the sources of the Telugu Prabandha, 'Prabhāvatīpradyumnam' and illustrating the genius of its author Pingaḷi Sūranārya. The poet Sūranna is not only a star of the first magnitude in Telugu Literature, but also a pioneer of novel attempts in the literary field of his age. The author of 'Kavitvatatvavichāram' has already opened the eyes of the Telugu Public to the greatness of this poet, by applying modern principles of literary criticism to his works and by giving a true estimate of his poetic genius. This bulletin dealing critically, as it does, with the sources of the plot of Prabhāvatīpradyumnam, not only serves to complement the work done by others, but also helps immensely the student of Telugu Literature in appreciating the originality and greatness of the poet.

'LIMBDI GARDENS,'
ROYAPETTAH,
*1st August 1933.*

K. RAMAKRISHNIAH, M.A.,
SENIOR LECTURER IN TELUGU,
*Oriental Research Institute,*
*University of Madras, Madras.*

శ్రీరస్తు.

ప్రభావతీ ప్రద్యుమ్నమునుగూర్చి, తత్కర్త పింగళి సూరనార్యుఁడు హరివంశ కథాశ్రయమని చెప్పియుండఁగా, మునుపటి పండితులు కొందఱా కథ, హరివంశమున లేదనియు, నందలి యుషాపరిణయ కథనే యిట్లు రచించి, దానికి, ప్రభావతీ ప్రద్యుమ్నమని, కవి క్రొత్తపేరిడెననియు నభిప్రాయపడిరి.

"హరివంశమునం దీ కథ కనుపట్టుట లేదు. ఈ కథయందలి ముఖ్యమగు పట్టులన్నియును బరికించి చూచినచో అనిరుద్ధ చరిత్రయందలికథ పట్టులే పెక్కులు కానంబడియెడు. అనిరుద్ధ చరిత్ర హరివంశములోనిది. ఆ కథయందలి శోణపురమే యిందలి వజ్రపురము. అచ్చటి పార్వతీవర మాహాత్మ్యమే యిచ్చటి పార్వతీ వర మాహాత్మ్యము. అందున్న స్వప్నమే యిందలి స్వప్నము. అచ్చటి బాణాసుర వధయే, యిచ్చటి వజ్రనాభవధ".

(తల్లావఝ్ఝల సూర్యనారాయణరావుగారి
ప్రభావతీ ప్రద్యుమ్నముయొక్క యుపోద్ఘాతము.)

గతానుగతికముగ నందఱమును నట్లే యనుకొంటిమి. కాని జిజ్ఞాసువులకుఁ దద్విషయమునఁ గొన్ని సందేహములు బాధాకరములుగానే యుండెను. హరివంశమున లేనికథను "హరివంశ కథాశ్రయ"మని కవి బొంకనేల? ఉషాపరిణయ కథను దారుమారుచేసి యీ క్రొత్తపేరిడనేల?

ఈ సందేహములు బాధించుచున్నను, మూలవిషయము మాట మనకేల యని, యందఱమును, బ్రస్తుత ప్రబంధమునే కొనియాడి యబ్బురపడితిమి. మఱియుఁ గళాపూర్ణోదయమువలె నిదియుఁ గేవలకల్పనాకథ యేమోయనియు శంకించితిమి.

తెలుఁగున గల రెండు హరివంశములలోను ఈ యితివృత్తము లేమిఁ జేసియు నుషాకథకును దీనికిని ఏ యొకటి రెండంశములనో తక్క సర్వత్ర సామ్యము లేమిఁ జేసియు నట్లు శంకించుట కలిగినది.

హరివంశ మనఁగాఁ దెల్గు హరివంశము మాత్రమే యని భ్రమించి సంస్కృత పురాణమును జూడకుండుటవలన దొరలిన ప్రమాదమిది.

ఇట్లుండ శ్రీయుత పురాణపండ మల్లయ్య శాస్త్రిగారు, ఆ గ్రంథమునకు వ్యాఖ్యానము వ్రాయు సందర్భమునఁ జక్కఁగాఁ బరిశీలించి, సంస్కృత హరివంశముననున్న యీ కథను గనుగొని లోకమునకుఁ జూపి చెప్పిరి. కాని వారు

సూరన ప్రబంధమున మూలాతిశాయియగు గుణమెయ్యెడ గలదో వివరింపరైరి. అయిన నేమాయె. మూలమును గనుగొని చూపుటచేతనే వారు వంద్యులు. సంస్కృత హరివంశమున రెండవపర్వమగు విష్ణుపర్వమున ప్రభావతీ ప్రద్యుమ్న కథ యంతయు. తు, చ, తప్పకుండ నున్నది. ఎలనో, ఎఱ్ఱనయు, సోమనయుఁ గూడ, రసవంతమైన యీ కథను దెనిఁగింపరైరి.

పంధ్రెండవ శతాబ్దిని తిరువనంతపురమును బాలించిన "రవివర్మ" భూపుఁడను రాజకవి యీకథనుబట్టియే "ప్రద్యుమ్నాభ్యుదయము" అను నొక సంస్కృత నాటకమును రచించెను. భాసనాటకముల నుద్ధరించిన గణపతి శాస్త్రిగారే దానిని గనిపట్టి యచ్చొత్తించిరి. నేనానాటకమును సంపాదించి చదివి చూడఁగా మన ప్రభావతీ ప్రద్యుమ్నమునకు ఆ నాటకముగూడ మూలము కావచ్చునను నను మాన మేర్పడెను. మన ప్రభావతి, మన ప్రద్యుమ్నుఁడు మన కృష్ణుఁడు, మన వజ్రనాభుఁడు, తుదకు మన భద్రనటుఁడు—అందఱును ఆ నాటకమునఁ గాన వచ్చిరి. కాని, పాపము ! శుచిముఖి లేదు.

నేను హరివంశము నే కాక పైని పేర్కొన్న నాటకమును గూడ, మన ప్రబంధమునకు మూలముగా భావించితిని.

హరివంశ విషయము నిర్వివాద్యమే. ఇఁక నాటక విషయము. ప్రబంధ ములోని చిత్రదర్శన విషయము పురాణమున లేదు. అది యీ నాటకమున నున్నది. సూరన దాని నటనుండి గ్రహించి యుండవచ్చునని భావించితిని. నేనిందుఁ దలపెట్టిన విషయము ప్రభావతీ ప్రద్యుమ్నమునకును, తన్మూల గ్రంథ ములకును గల గుణతారతమ్య నిరూపణము. అందులకై తొలుత మూల కథలను రెండింటిని వివరముగ వ్రాసి, వానికిని మన కథకును గల విరోధాంశములఁ జూపి మాతృవిరుద్ధములైన యీరచనలవలన నేమి గుణము సంపాదింపఁబడినదో నిర్ణ యింతును. మూలములతోఁ బోల్చి ప్రబంధగుణము వెలయించుటయే యిందలి ప్రధాన ప్రయోజనము. ప్రసక్తము లైనపుడు తక్కిన విశేషములను గొన్ని టిని దడవినను నవి ముఖ్యములు గావు.

ఇంకొక విషయము. "భావనాశక్తి ప్రదర్శకమై, కల్పనా చాతురికి నిధాన మైన కళాపూర్ణోదయము వ్రాసిన సూరన కించిదూనమైన యీ ప్రభావతీ ప్రద్యుమ్న మేల వ్రాసెను." అని యొక సందేహము. నా యభిప్రాయ మేమన, ఆ దినములలోఁ "గేవల కల్పనాకథల"కు నాదరము తక్కువ. ప్రబంధకవు లెల్లరుఁ బౌరాణిక గాథలనే యెత్తి కావ్యములు వ్రాసి ఖ్యాతివడయుచుండిరి. సూరనయు "సానల దీఱిన జాతిరత్నము"ను ఆంధ్ర సరస్వతికి నలంకారముగాఁ గై సేసి సమ కాలికుల మెప్పు పడయవలెనని హరివంశపు గని త్రవ్వి యీ రత్నము నెత్తెను. మఱియు నంది తిమ్మనార్యుని పారిజాతాపహరణము కూడ సూరన రచనకుఁ బ్రేర

కమ్మై యుండును. పారిజాతాపహరణ కథను తిమ్మనగారు హరివంశమునుండియే కైకొనిరి. కనుక సమకాలాదరముకొఱకే సూరన యీ కావ్యమును రచించి యుండును. చేమకూర వెంకన్నవలె పింగళి సూరన్నయు "ఏ గతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చరే కదా"! యని చిడిముడి పడెనేమో?

సమకాలమువారినే యననేల? ఈ కాలమువారిలోఁ గూడ సూరనను మెచ్చినవా రల్పసంఖ్యాకులు. మెచ్చనివారు, మెచ్చలేనివా రనుట తప్పుకాదు. ఆ మహాకవియెడ లోకమునకు నిప్పుడిప్పుడే భక్తిగౌరవములు కల్గుచున్నవి. శ్రీరామలింగరెడ్డిగారి కవిత్వ తత్త్వ విచారమే సూరనార్యుని భారతికి సమర్పింపబడిన ప్రథమోపహారము. నాయీ చిన్నవ్యాసము కూడఁ దత్పాద పీఠి నొక దళ మగుఁ గాక.

---

# హరివంశము నందలి కథాక్రమము.

వజ్రనాభుఁడను మహాసురుఁ డొకఁడు మేరుపర్వతసానువునఁ దపమాచరించి బ్రహ్మను మెప్పించి యాతనివలన నమరావధ్యత్వమును, సర్వరత్నమయమై శతశాఖానగర పరివృతమై తనయాజ్ఞ లేక యితరులకు నప్రవేశ్యమైన వజ్రపురమును, వరదానములుగ గ్రహించెను. వరదర్పితుఁడైన యాదానవనాయకుఁ డొకప్పుడు దేవలోకమున కేఁగి మహేంద్రునితో "పాకశాసనా! ఈత్రైలోక్యమును శాసింపవలెనని నాకు నిచ్ఛగలదు. నీప్రభుత్వమును నాకిమ్ము. లేదా యుద్ధమిమ్ము. కాశ్యపులమైన మనకీ జగమంతయు సామాన్యము గాదా!" యనియెను. ఇంద్రుఁడును బృహస్పతితో మంత్రాలోచన చేసి వజ్రనాభునితో నిట్లనియెను. "సౌమ్యుఁడా! మనతండ్రి కశ్యపుఁడిపుడు సత్రదీక్షితుఁడై యున్నాఁడు. సత్రావసానమున నయ్యనఘుఁడేది న్యాయ్యమని యాదేశించునో యట్లు నడచుకొందము." అనుటయు దానవుఁడు తండ్రిపాలి కేఁగి తనకోర్కి విన్నవింపఁగా నామహాముని "సత్రావసానమున మీసంగతి విచారించి తీర్చెదను. ఇప్పటికి నుద్ధతిమాని నీవు వజ్రపురమునకుఁ బొమ్ము" అనెను.

అనంతరము సురరాజు ద్వారవతి కేఁగి శ్రీకృష్ణునితో జరిగిన వృత్తాంతము తెల్పఁగా నయ్యనఘుఁ డిట్లనెను. "ఇప్పుడు మాతండ్రి వసుదేవుఁ డశ్వమేధ దీక్షితుఁడై యున్నాఁడు. యజ్ఞము కడచనఁగనే వజ్రనాభ వధోపాయము విచారింతును. అతని పురమితరులకు నప్రవేశ్యమఁట. తదుపాయము మన మిర్వురమును జింతింపవలెను."

వసుదేవ యజ్ఞసమయమున భద్రుఁడను నటుఁడొకఁడు ద్వారకకువచ్చి సభ్యులైన మహర్షులకుఁ దన నాట్యవిద్యచే వినోదము కల్పించెను. వారును వాని నైపుణి మెచ్చి వానికోరిన వరము లిచ్చిరి. సర్వద్విజులకు భోజ్యుఁడగుటయు, నిరాతంకముగా సప్తద్వీప సంచారము సేయఁగల్గుటయు, సర్వభూతములవలన నవధ్యత్వమును, వేషధారణమున రూపసాదృశ్యమును, జరారోగరహితత్వమును, ననునవి యావరములు. వరదానమువలన భద్రుఁడధిక తేజశ్శాలియై నానాద్వీపముల నాటకములాడి యెల్లర సంతోషపెట్టుచు నెడనెడఁ బర్వదినముల ద్వారకకు వచ్చి పోవుచుండెను.

అట నింద్రుఁడు దేవలోకనివాసములైన హంసములఁ బిలిచి యాదరించి "పక్షివరులారా! కాశ్యపులమైన మనము సోదరులము. విశేషించి మీరు దేవ

తలకు విమానవాహనములరు. అట్టి మీతో మాకొక కార్యము కలిగినది. అది శత్రువధాన్వితమైన మంత్రము. ఎచ్చటను నుబ్బనీక నెఱవేర్పవలెను. మీసంచారము లెల్లెడల నప్రతిషిద్ధములు గనుక మీరు వజ్రపురము ప్రవేశించి యంతఃపుర వాపీవీథుల సంచరించు చుండవలెను. ఆదానవునకుఁ బార్వతీ వరదానము వలనఁ బుట్టిన 'ప్రభావతి' యను కొమార్త కలదు. ఇప్పుడా కన్నె స్వయంవరము జరగుచున్నది. మీరామెతోఁ జెలిమి కల్గించుకొని మహాత్ముఁడైన 'ప్రద్యుమ్ను'ని గుణరూపాదు లామెకు వర్ణించిచెప్పి, యాతనియందు రక్తభావ యగు నట్లుచేసి, యామెసందేశము ప్రద్యుమ్నున కెఱిఁగించి, యాతనివలన మరల నామెకు సందేశము గొనివచ్చి వారికిర్వురకు భావబంధము ఘటింపవలెను. ఏనాఁటి వృత్తాంత మానాఁడు నాకును నాసోదరుఁడగు శ్రీకృష్ణునకును నెఱిఁగించుచుండవలెను. ప్రద్యుమ్నుఁ డాయువతిని గ్రహించువఱకు నీయత్నమున నేమఱియుండరాదు. ఆరాక్షసుఁడు దేవతలకవధ్యుఁడు. దేవపుత్త్రులైన ప్రద్యుమ్న ప్రముఖులు భద్రనట వ్యాజమున వజ్రపురముసొచ్చి యాయసుర వినాశము చేయఁగలరు. మఱియుఁ గాలోచితమైన యేయే యత్నమావశ్యకమో యది యెల్లఁజేసి యీదేవకార్యమును సాధింపఁదగు''నని యాదేశించి పంపెను.

ఇంద్రునిమూదలఁ గైకొని హంసలు వజ్రపురికిఁ బోయి కేళీదీర్ఘికల విహరింపఁదొడఁగెను. వాని సంచారములు వజ్రనాభునకుఁ బూర్వపరిచితములే కనుక నాతఁడు వాని నాదరించి తన నివేశమునకుఁ బిలిచికొని పోవ నవియు నచట నెల్లరతోడనుఁ జెలిమి కలిగించుకొని చక్కని కతలుచెప్పుచు నంతఃపురస్త్రీలకు నాదరపాత్రములయ్యెను. వానిలో శుచిముఖి యను హంసి ప్రభావతికిఁ గూర్మిసఖియై యొకనాఁడేకాంతమునఁ బ్రసంగము తిగిచి యాకన్యతో నిట్లనెను. "ప్రభావతీ! నీవు త్రిలోకసుందరివి. స్వయంవర న్యస్తవయ్యు దేవాసురకులోద్భవుల నెవ్వరిని మెచ్చకున్నావు. వారు నీచేఁ బ్రత్యాఖ్యాతులై సిగ్గుపడి పోవుచున్నారు. అట్టిచో రుక్మిణీసుతుఁడైన ప్రద్యుమ్నుఁడు మాత్రమేల రాఁదలఁచును. అతనిగుణరూపశౌర్యము లనుపమానములు. అతఁడు దివ్యులలోదివ్యుఁడు. మనుష్యులలో మనుష్యుఁడు. దానవులలో దానవుఁడు. సూర్యతేజము, నగ్నిరుచి, పృథివీక్షమ, హ్రదగాంభీర్యము, నతని యొక్కనియందే యున్నవి." అనినఁ బ్రభావతి "హంసీ! మానుషలోకస్థుఁడగు విష్ణునిగూర్చి నేనును గొంత వినియున్నాను. అతఁడు మాదానవ కులమునకు వైరి. దనుజవీరు లెందఱెందఱో యాసుదర్శనుచే హతులైరి. పుట్టినింటివారికంటె నత్తింటివారధికులుగ నుండవలెనని స్త్రీలకోర్కి. నేనాయాదవుల కోడల నైతి నేని యదృష్టము కాదా! ఆ ప్రద్యుమ్నుఁ డిచటికి రాఁగల్గు నేని నాయెడ ననుగ్రహము చేసినట్లగును. మా కులముకూడఁ బవిత్రమగును. అతని జన్మాదికథనము నే నీవఱకే వినియున్నాను.

నాహృదయమెప్పుడును నవశమై యతని దెసనే వర్తించుచుండును. నేనాతని వరింతును. నీకు మ్రొక్కెదను. నన్ను గ్రహించి దూతివై యతనిపాలికిఁ బోయి నామీఁద దయపుట్టఁబలికి తోడ్కొనిరమ్ము. నీవు విద్వాంసురాలవు. ఆతని రప్పించుభారము నీయది." యని మనసిచ్చి మాటలాడి ప్రతిమాలెను.

అంత శుచిముఖి "నేను నీచెప్పినట్లు చేయుదును. ప్రద్యుమ్ను నెడ నీకుఁ గల భక్త్యాదరత నాతని కెఱిఁగింతును. నిన్ను సాక్షాత్కామునికి భార్యనుజేసెదను. కాని నీవు మాత్రము మీతండ్రితో నాకుఁగల కథాకుశలత నుగ్గడింపుము. నాయెడ నాతనికి మమత్వము కలుగుట లెస్స." యని తెల్పఁ బ్రభావతియు నట్లుచేయ దానవాధిపుఁడు శుచిముఖిని జేరఁ బిల్చి "హంసీ! నీవు కథా కథన ప్రవీణ వని మా ప్రభావతి తెల్పెను. నీవు త్రిలోక సంచారిణివి గదా! ఎచ్చటనేని గొప్ప వింతలు గంటివా? తెల్పు" మనుడు శుచిముఖి భద్రుని గూర్చి మిక్కిలిగాఁ గొనియాడి యతని నాట్య కుశలతను వివిధ విద్యానేతృతను విశేషించి యుగ్గడించి యతని యెడ రాక్షసరాజునకుఁ గుతూహలము పుట్టించెను. అంత వజ్రనాభుఁ "డౌనౌను! నేనును వింటిని, వానిఁ జూడవలెనని నాకిది వఱకె వేడుక కలదు. ఇతఁ డిచటికి వచ్చు దారి చూడు" మన హంసి "చిత్త" మని సెలవుఁ గైకొని పోయి యింద్రోపేంద్రులతో నిచటి వృత్తాంతము విన్నవింప వాసుదేవుఁడు వజ్రనాభవధకును ప్రభావతీ సంసర్గమునకును బ్రద్యుమ్ను నియోగించి గదసాంబులను మఱి కొందఱి యాదవులను దోడిచ్చి భద్రనటుని జేతఁజేసి నటవేషములతో నందఱ వజ్రపురికినంపెను. వారును వజ్రపురశాఖానగర మగు సుపురము చేరిరి. శాఖానగరవాసులైన దానవులు తమ ప్రభునానతి నటులకు నాతిథ్యాది సత్కారము లాచరించి విడిది యొసంగి శ్రుతపూర్వుఁ డైన భద్రుఁడు వచ్చెనని వేడ్కపడి బహువిధ నాటకము లాడించి మెచ్చి నానావిధ బహుమానము లిచ్చిరి. రావణ వధేచ్ఛచే మహావిష్ణు వవతరించుట యాదిగా రామాయణగాథ యంతయుఁ బ్రదర్శితము కాఁగాఁ దత్కాల వాసులైన వృద్ధదానవులు పాత్రల తుల్యత్వమునకు విస్మయపడిరి, అనంతరము వజ్రనాభుఁడు మేళమును వజ్రపురికిఁ బిలిపించి నాటకము లాడించెను. పటాంతరితలై యంతఃపుర స్త్రీలును నాటకములు చూడ వచ్చిరి. ప్రద్యుమ్నుఁడు ప్రయోగించిన నృత్తగీతవాద్యాది విశేషములకును 'రంభాభిసరణ' మను నాటకమునకును దానవ నాయకుఁడు పరమ సంతుష్టుఁడై కనకరత్నమయము లయిన పెక్కువస్తువులు కానుకలిచ్చెను.

అంత శుచిముఖి ప్రభావతిని జేరఁ బోయి "రాజపుత్రీ! ద్వారవతి కేఁగి వచ్చితిని. ప్రద్యుమ్ను నెడ నీకుఁ గల భక్త్యనురాగములు తెల్పితిని. అతనికిని నీయం దనురాగ ముదయించెను. అతఁడు నేఁటిరాత్రి నీ యున్న

యెడకు రాఁగలఁ"డని చెప్పఁగాఁ బ్రభావతి "శుచిముఖి! నీవు నేఁడు నాతో నుండుము. నిన్నుఁ జెంతనిడికొనియే కేశవపుత్త్రు దర్శింపవలెను గాని లేనిచో నాకు భయమగు" నని వేఁడికొనఁగా హంసియు నొడఁబడి ప్రద్యుమ్ను పాలి కేఁగి సంకేత మెఱిఁగించి వచ్చి ప్రభావతినిఁ జేరి యతని రాక నిరీక్షించు చుండెను.

ప్రద్యుమ్నుఁడును బ్రభావతికిఁ జెలికత్తెలు కొనిపోవు పుష్పమాల్యమున భ్రమరాకారుఁడై ప్రవేశించి యంతిపురిఁ జేరి ప్రభావతీ కర్ణోత్పలమున నణఁగి యుండెను. అంతలోఁ జంద్రోదయ మగుటయు రాజపుత్త్రికి రసభావము దుస్సహమై వల్లభు నుపేక్షకు విలపింపఁ దొడఁగెను.

అంతటఁ బ్రద్యుమ్నునకుఁ బ్రభావతియెడ విశ్వాసము కుదిరి నిజరూపమున నామె మ్రోలఁ దోఁచి నిల్చి లజ్జావనత వదనయైన యా ముగుదను లాలించి కైదండఁగూర్చి గాంధర్వవిధిని బరిగ్రహించెను. అతఁడు రాత్రులఁ గన్యాంతఃపురమునుండి రహస్య భంగ భయమునఁ దెల్లవాఱక మున్నే విడిది చేరుచుండెను.

ఇట్లుండ వజ్రనాభుని తమ్ముఁడగు సునాభుని కొమార్తెలు చంద్రవతీ గుణవతులను కన్నె లొకనాఁడు ప్రభావతీ ప్రద్యుమ్నుల నేకాంతమునఁ జూచి యనుమానించి నమ్మకముగా నావివరమడుగఁ బ్రభావతి యిట్లనెను. "నేన పూర్వమైన యొకవిద్య యెఱుఁగుదును. దాని ప్రభావమున నాకభిమత భర్తృ సమాగమమైనది. అతఁడు దేవతాపురుషుఁడు త్రిలోకసుందరుఁడు, సత్య సంపన్నుఁడు, ధర్మశీలుఁడు, వలయు నేని చూడుఁడని వారికిఁ బ్రద్యుమ్ను దర్శనము చేయించెను. ఆకన్నె లాతని రూప యౌవన సంపదఁ జూచి విస్మితలైరి. వారి విస్మయ భావమును గనిపట్టి ప్రభావతియు మఱల నిట్లనెను. "దేవతలు ధర్మనిరతులు, తపస్సక్తులు. సత్యశీలురు, మీరును నావలెనే దివ్యపురుషుల వరించి సుఖింపుఁడు, నావిద్య మీకును నుపదేశించెదను," అని వారి నొడఁబఱిచి యావిషయము వల్లభున కెఱిఁగింప నతఁడు గదసాంబులఁ దోడ్కొని వచ్చి సునాభపుత్త్రికలనిచ్చి గాంధర్వ వివాహములు సేయించెను. ఆ రీతిగా యదుకుమారులు కన్యాంతఃపుర భోగముల ననుభవించుచు వజ్రనాభ వధార్థము శక్రకేశవుల యాదేశమున కెదురు చూచుచుండిరి.

కశ్యపుని యజ్ఞము ముగియుటయు వజ్రనాభుఁడు త్రైలోక్య విజయాకాంక్షియై యా మునిపతిని సందర్శింప నయ్యనఘుఁ డిట్లనియెను. "నీవు స్వజన సమావృతుఁడవై వజ్రపురముననే యుండుము. ఇంద్రుఁడు నీకజయ్యుఁడు. అతఁడు తపోఽధికుఁడు, బ్రహ్మణ్యుఁడు, కృతజ్ఞుఁడు, నీకు జ్యేష్ఠుఁడు జగమునకు రాజు, విశేషించి కృష్ణునకుఁ బాత్రభూతుఁడు. ఏల కుడిచి కూర్చుండి రిత్తకు రిత్తఁ

ద్రాఁచును ద్రొక్కి ప్రాణముల మీఁదికిఁ దెచ్చికొందువు. పొమ్ము, నామాటవిని నిరుపద్రవముగా బ్రదుకుము. పొ''మ్మన వజ్రనాభుఁ డాహితవాక్యముల దెస ననాదరముఁ జేసి విజయారంభుఁడై జ్ఞాతియోధులను మిత్రులను గూర్చికొని స్వర్గము మీఁదికెత్తి నడవ నుద్యుక్తుఁ డాయెను. ఆలోఁగా నింద్ర కేశవులు రాక్షసేంద్రవధను గూర్చి కుమారులకు హంసలముఖమునఁ గబురంపిరి. వారును దమంతఁ గూడికొని మంత్రాలోచనచేసి "వజ్రనాభుని బ్రద్యుమ్నుఁడే కడతేర్పవలె"నని నిర్ధారించుకొనిరి. కాని వారి భార్యలు మువ్వురును నాపన్నసత్వలై యుండిరి. "అది యుద్ధానుకూల సమయమగునా ?" యని సందేహించి కుమారులు మరల హంసల శక్ర కేశవుల కడ కనుప వారా సందేహము తీర్చి యభయ వాక్యములు పల్కిరి.

దానవ పుత్రికలు ప్రసవించిరి. మువ్వురకును మగపిల్లలే కలిగి సద్యోయౌవనులై హర్మ్యపృష్ఠమున వర్ధమాను లగుచుండ నాకాశరక్షులగు దైత్యభటులు చూచి ససంభ్రములై వజ్రనాభున కెఱిఁగింప నతఁ డవమానఖిన్నుఁడై గృహాధర్షకులఁ బట్టి బంధించి చంపుఁడని యానతిచ్చెను. ప్రభు నానతి సేనలు కూడికొని నలుదెసలఁ జుట్టి 'పట్టుఁడు. కొట్టుఁడు. చంపుఁ' డని యార్చుచు నంతఃపురము చేరరాఁగా దనుజపుత్రికలు భయచకితలై యాక్రోశింపఁ దొడఁగిరి. ప్రద్యుమ్నుఁడు సన్నిహితుఁడై యభయవాక్యముల వారి నోదార్చి ప్రభావతితో నిట్లనియెను. "దేవీ ! అటు చూడుము. నీతండ్రియుఁ బినతండ్రియు జ్ఞాతులును యుద్ధకాములై వచ్చి నిల్చిరి. వారెల్లరు నీకుఁ బూజ్యులు, మాన్యులు, మమ్ముఁ జంపు నుద్దేశమున వచ్చిరి. ఇది దారుణముహూర్తము. మరణము సరకుఁ గొనక పోరాడవలెను. మాకిపుడు కర్తవ్యమేమి ? నీ చెల్లెండ్రఁ గూడ నడిగి విచారించి చెప్పు" మనఁ బ్రభావతి శిరమున నంజలి ఘటించి భర్తృపాదములకడ మోకరిల్లి కన్నీరు నించుచు "నో శత్రునిబర్హణ! శస్త్రమును గ్రహింపుము. ఆత్మరక్షణముఁ గావించుకొనుము. ఆర్యవైదర్భిని దలఁచియుఁ గుమారు నసిరుద్ధుఁ దలఁచియు నాత్మ రక్షణముఁ గావించుకొనుము. ధీమంతుఁడైన దుర్వాసోముని వైధవ్యరాహిత్యమును జీవత్పుత్రత్వమును నాకు వరములుగా నిచ్చెను. ఆవరవాక్యమే నా యెడఁదకూఱట యగును. సూర్యాగ్నితేజుఁడగు నామహాముని మాట యన్యథాకానేర"దని హెచ్చరించి ఖడ్గమును దెచ్చి యతని చేతికిచ్చి 'జయింపు' మని దీవించి పంపెను. అట్లే చంద్రవతీ గుణవతులుఁగూడ ఖడ్గములు తెచ్చి గదసాంబుల కిచ్చిరి.

ప్రద్యుమ్నుఁడు మాయాప్రభావమున నొక రథము కల్పించుకొని గదసాంబుల నంతఃపుర రక్షణకుఁ జోలించి తానాకాశమున సర్వదిశలఁ బోరువాఁడై యసురసైన్యవధార్థము వెల్వడి యాశీవిష ప్రఖ్యములైన శరములచే దితిసంభ

వుల విదళించెను. వారును రణమత్తులై కృష్ణనందను మొత్తిరి. దేవగణ సహితుఁడైన దేవేంద్రుఁ డాయుద్ధము నంతరిక్షగతుఁడై చూచి మెచ్చి మాతలిసుతుఁడు సారథిగాఁ దన రథమును గదునకును, నైరావతమును సాంబునకును బంపెను. ప్రద్యుమ్నసహాయార్థము జయంతుఁడును వచ్చెను. ఇరువాఁగును రేయెల్ల బోరిరి. దానవ సేనలో మూడువంతులు నాశమయ్యెను.

సూర్యోదయమగు వేళకు గరుడవాహనుఁడై కృష్ణుఁడును జేరవచ్చి యంతరిక్షమున నింద్ర సమీపమున నిల్చి పాంచజన్యమును బూరింపఁగా గుమారుఁడదివిని పితృ సన్నిధి కేఁగి నమస్కరింప మురారి 'నీవీ గరుడు నధి రోహించి వజ్రనాభునిఁ గూల్పు' మని బరవసము సేయ నతఁడును నట్లచేసి గదచే రాక్షసేశ్వరు వ్రేసెను. వాఁడును మూర్ఛపడి లేచి శతఘంటికమైన గద చేకొని ప్రద్యుమ్నుని వ్రేయ నతఁడు నెత్తురురల నేలఁ బడెను. ఆశ్వాసనకరముగాఁ గృష్ణుఁడు పాంచజన్యమొత్తుటయుఁ గుమారుఁడు లబ్ధసంజ్ఞుఁడై పితృప్రేషితమైన చక్రమున దైత్యుని శిరము నఱకెను.

అప్పుడే గదుడు సునాభుని గడ తేర్చెను, సాంబుఁడు తక్కటిమూఁకలఁ బొరిగొనెను. కృష్ణకేశవులు భూమికవతరించి పుత్త్రుల నభినందించి వజ్రనాభ రాజ్యమును బౌత్త్రులకుఁ బంచి యిచ్చి మఱియు నవసరోచితములైన వరము లిచ్చి చనిరి. గదసాంబప్రద్యుమ్ను లాఱుమాసము లాపురమున నుండి రాజ్యము రూఢము చేసి ద్వారక కేఁగిరి.

## ప్రద్యుమ్నాభ్యుదయేతి వృత్తము.

బ్రహ్మర్షియైన నారదుఁ డొకనాఁడు శ్రీకృష్ణ దర్శనార్థము ద్వారక కేఁగెను. పరస్పర కుశల ప్రశ్నాదికమైన పిమ్మటఁ గృష్ణుఁడు నారదుని యాగమన కారణ మడుగఁగా నమ్మునీంద్రుఁ డిట్లనియెను.

" మహాభాగా ! వసుదేవ వితన్యమానాశ్వమేధ మహోత్సవ ధురంధరుండవైన నీ దర్శనమే నారాకకుఁ బ్రథమకారణము. ఇఁక రెండవది. అఖండ భుజ శౌండీర్య కుంఠితాఖండల వజ్రుఁడైన వజ్రనాభుఁడను దానవపతి కనకగిరి కటకమునఁ జిరకాలము తపముచేసి తత్ప్రకర్షచేఁ బితామహుని సంతోషపెట్టి యాయనఘువలన నమరావధ్యతయు, నిజానుమతిలేక యఖిల దుష్ప్రవేశమై రత్నమయమైన వజ్రపురమను నగరమును, సకలసంకల్పసిద్ధియు, వరములుగాఁ బడసి ద్విగుణిత మదాంధకారిత హృదయుఁడై త్రిభువనములకుఁ బీడఁ గావించుచుండెను.'

కృష్ణుఁడు వజ్రనాభవృత్తాంతము మున్నే దేవేంద్రుని వలన విని యునికిం జేసి నారదున కిట్లనియెను. " దేవర్షి ! ఈ వృత్తాంతము భగవంతుఁడైన

దేవేంద్రుఁడు వచ్చి నాకింతకుఁ బూర్వమే యిట్లని చెప్పెను. "చతురానన దత్త వరలాభ గర్వితుఁడైన వజ్రనాభుఁ డొకప్పు డమరావతికి వచ్చి సన్నిట్లని యెను.' వాసవా ! నాకు జగదైశ్వర్యమిమ్ము. లేదా యుద్ధమిమ్ము. ఈజగమంతయు మహాత్ములైన కాశ్యపులకు సామాన్యము గాదా !' యనుటయు నేను బృహస్పతితో నాలోచన చేసి యిట్లంటిని. 'సౌమ్యుఁడా! మనతండ్రి కశ్యపముని యిప్పుడు సత్ర దీక్షితుఁడై యున్నాఁడు. అది ముగియఁగనే యాయన యేది న్యాయ్యమో యది చేయు'నని. అంత వజ్రనాభుఁడు కశ్యపుని పాలి కరిగి వృత్తాంతమంతయు నివేదింప నాబ్రహ్మర్షి 'పుత్రా! సత్రావసానమున నేది యుచితమో యది చేయుదము, నీవిప్పటికి నిజపురమునకుఁబొ' మ్మని యానతీయ నా నికృష్టాశయుఁ డట్లో సమ్మతించి వజ్రపురముఁ జేరి యిప్పుడు జగదుపప్లవమును జేయుచున్నాఁడు. పిమ్మట దేవరయే ప్రమాణము." నేనును నానాఁడే దురాత్ముఁడైన యా సురద్వేషి నిరసనమునఁ గృత నిశ్చయుఁ డనైతిని. అయ్యా, మాతండ్రిగారు చేయుచున్న యశ్వమేధమువలన నిన్నినాళ్లును విలంబమైనది. ఆక్రతువుగూడ నాసన్నావభృథమయ్యెను. కాన యజ్ఞావసానమే దానవ హతకుని జీవితావసానము కాఁగలదు. ఇంత యేల ? ప్రద్యుమ్న కుమారుఁడే యచిరకాలమున నావజ్రనాభుని యుద్ధమునఁ గూల్చి తదవరోధ నితంబినీ బాష్పాంబులచే జగత్త్రితయ తాపము నార్పఁగలఁ" డనుడు నారదుండు ప్రముదితుఁడై "భవదాత్మజన్ముఁడైన శంబరమథనున కేది దుష్కరము? అదియును గాక దీన నింకొక ప్రయోజనము గూడఁగలదు. ఆదానవపతికిఁ బ్రభావతి యను కొమార్తకలదు. ఆ కన్యా రత్నము సౌందర్యనిధి. ఆమెను దజ్జనని పార్వతీవరదానము వలనఁగనెను. ఆకన్యను జెట్టపట్టువాఁడు నిరవధికకాలము జీవించు ననియు నామెయు జీవత్పుత్రయగు ననియు దుర్వాసుని మాట కలదు. ఆ ప్రభావతి యిప్పుడు నవయౌవనోదయ విశేష రమణీయయై తండ్రిచే స్వయంవరస్థాపితయై స్వయంవరాగతులైన యువజనుల నెవ్వరిని మెచ్చక యున్నది. సకల లోకాతిశాయి సౌందర్య సంపన్నుఁడైన ప్రద్యుమ్నుఁడు వజ్రపురమునకుఁ బోవుచో నాతని యం దామె మనసు లగ్నమగు" నని కృష్ణుని కెఱిఁగించి యిచ్చటి యత్నము దేవలోకము వారికిఁ దెల్పి సంతోషపెట్టుటకై ద్వారకానాథుని యనుజ్ఞఁగొని యటకేఁగెను.

సకల దుష్ప్రవేశమైన వజ్రపురమును బ్రద్యుమ్నుఁడు ప్రవేశించుట యెట్లనికృష్ణుఁడు విచారించి నను దేవయజ్ఞకాలమున నాట్యప్రయోగములు నెఱపి మునిజన సంఘమువలన సర్వప్రదేశాప్రతిహతప్రవేశాది వరములు పడసి యున్న భద్రుఁడను నటునిముఖముననే యీ దుర్ఘటకార్యము సాధనీయమని నిశ్చయించి వానిఁ బిలిపించి వజ్రనాభవధోపాయాత్మకమైన తమకార్యము వాని కెఱిఁగించి యాతంత్రోపాయమును వాని చెవిలో నుపదేశించెను. వాఁడును

జగత్పతి స్వయముగాఁ దన్నుఁ బిలిపించి మహాకార్య నిర్వహణమున నియోగిం
చుట తన పూర్వపుణ్యఫల మనుకొని సంతసించెను

భద్రుఁడను నటుఁడు నిస్సమాన్యవిద్యా విభవుఁడని హంసుఁడను చారణ
పతివలన విని వజ్రనాభుఁ డాకుశీలవుని జూడఁ గుతూహల పడెను ఇంతలో
నతఁడును దేశదేశములు తిరుగుచు వజ్రపురశాఖానగరమునకు వచ్చి రామా
యణకథానుబంధినాటక ప్రయోగముల వలన నచటి దానవుల సంతోష
పెట్టెను. సమీపగతుఁ డగు నాతని వృత్తాంతమువిని వజ్రనాభుఁ డాతనిఁ బిలి
పించి సత్కరించి ప్రభావతికి సంగీత విద్యాగురువుగా నియమించెను ఆ కన్యయు
గానకళాభియోగమున నసదృశయై గురుజనుల మెచ్చులందుచుండెను

ప్రభావతి తన గురువును దోడ్కొని రమ్మని కలహంసిక యను చేటిని
బంప నది భద్రుఁడు విడిసియున్న చోట నతివిస్మయకారణమగు నొక చిత్ర
పటమును జూచి దానిని హరించుకొని యాసంభ్రమమున భద్రుని బిలుచు
టయే మఱచి పోయి పరుగు పరుగునఁ బ్రభావతిని జేరఁ జేని యాచిత్రమును
జూపెను, అది యే మహాభాగుని ప్రతిబింబమో యెవరు వ్రాసినదో తెలియఁ
గోరి ప్రభావతి భద్రనటునిఁ బిలిపించెను.

ఆచిత్రపటము భద్రుఁడు వ్రాసినదే! అందలి ప్రతిబింబము ప్రద్యుమ్ను
నిదే! ప్రద్యుమ్నుని రూపాతిశయము ప్రభావతి కంటఁబడెనేని యా యువతి
యామన్మథావతారునియందు బద్ధానురాగ యగుననియుఁ బ్రసంగావసరములఁ
దా నాభావమును బోషింప వచ్చుననియు నెంచి భద్రుఁడా యుపాయము చేసెను.
అతని యూహ రిత్త వోలేదు ఆచిత్రము చూచినతోడనే ప్రభావతికి మనసు
చెదరెను, కాని యది వాస్తవరచనయో బుద్ధికల్పితమో యారయుపలెనని
గురుని బిలిపించినది. [భద్రుఁడు వజ్రపురమును బ్రవేశించుటయే గదసాంబ
సహితుఁడైన ప్రద్యుమ్నుని ప్రవేశము అతఁడు పరిగృహీత శైలూషవేషుఁడై
సపరివారముగ భద్రుని మేళమున నుండెను.] సఖీసమేతయై ప్రమదవనమున నున్న
రాజపుత్రిని సమీపించి భద్రుఁడాశీర్వదించి కూర్చుండఁ గలహంసిక మెల్లగాఁ
బ్రసంగముదాఁ దిగిచి 'యార్యా! త్రిభువన సంచారివగు నీవెఱుఁగని సంగతు
లుండవు. ఎచటనేని నిస్సమాన్యరూపగుణముగల యాకృతివిశేషముగంటివా ?'
యని ప్రశ్నింప ప్రద్యుమ్ననామగుణకీర్తనలకు సముచితావసరము కల్గెఁగదా
యని సంతోషించి యతఁడు ప్రద్యుమ్నుని కులగోత్రాదికమును సౌందర్య శౌర్యా
దులను వర్ణించెను. ప్రభావతి ప్రద్యుమ్నునిగూర్చి యీవఱకే యభిరూప
యువప్రసంగములవేళ వృద్ధస్త్రీలవలన విని యునికింజేసి భద్రుని వర్ణనకును నా
విసికికస బొత్తుగలిపి యేమేమో భావించుకొనుచు నొకవిధమైన దశావిశే
షము ననుభవించుచుండెను. పరేంగితాకారజ్ఞుఁడైన భద్రుఁడనుకూలవచనరచనా

దోహదంబున నాదశాంకురమును ఘోషించు ప్రసంగములు చేసెను. అంతఁ ప్రభావతి యానతినిఁ గలహంసిక తొల్లిఁటి చిత్రపటమునుజూపి యతఁడిట్లుండు నాయని ప్రశ్నింప భద్రుఁడు కార్యము ఫలించినదని లోలోన నుప్పొంగి యీ ప్రతిబింబమాకుమారునిదే యనియు నామహాభాగుని వియోగమువలనఁ దప్తమైన మనస్సునకు వినోదము గల్గించుకొనుటకు నేనే వ్రాసికొంటి ననియుఁ దెల్ప నతని జూచిన పురుషులే తద్విరహము భరింపలేరనుటఁ బ్రభావతికి మఱియు మనోవికారహేతువై యతని సాక్షాత్తు దర్శింపనామె కుతూహలము నినుమడించెను. భద్రుఁడు, తన విద్యాప్రభావమునఁ బ్రద్యుమ్నుని నతికాలముననే తెచ్చి దర్శన మిప్పించెదనని యీయువతికి మాట యిచ్చెను.

దనుజరాజకన్య ప్రద్యుమ్నునందు బద్ధభావయై దుస్సహమైన కామదశ ననుభవించుచుఁ దన మనస్సు సంగీతగురున కెఱింగించెను. అతఁడును వజ్రపురవృత్తాంతమును గగనపథ సంచారులచేత శ్రీకృష్ణునకుఁ దెలియ నంపెను.

పిదప వసంతాగమము కాఁగా వజ్రనాభుఁడు వసంతోత్సవము చేయువాఁడై యేదేని యొక నాటక మాడుమని భద్రు నడుగ నతఁడు ప్రస్తుత కార్యమున కుపయోగియైన 'రంభాభిసరణ'మను నాటకమాడ సంకల్పించి యందుఁ బ్రద్యుమ్నుఁడు నలకూబరవేషము వేయుటయుఁ దాను విదూషకుఁ డగుటయు మనోవతియను శైలూషి రంభయగుటయుఁ దగునని యేర్పఱచికొనెను.

'రంభాభిసరణ' నాటకవస్తువనతివిస్తీర్ణము. నలకూబరుఁడు విదూషక సహితముగఁ జైత్రరథ సంభూతమైన సంకేత లతామండపము చేరి రంభరాకను నిరీక్షించుచుండెను ప్రియ సమాగమ కాంక్షిణియై వచ్చు రంభను రావణుఁడు చూచి తఱుముకొని రాఁగా నాచకితాక్షి యేదే నుపాయమునఁ దప్పించుకొని భయవిహ్వలయై సంభ్రమమునవచ్చి నలకూబరు నక్కున వ్రాలెను. అతఁడు తద్భయకారణ మారసి క్రోధవివశుఁడై రావణు నుద్దేశించి "భోగేచ్ఛుఁడవై యిష్టములేని స్త్రీ నెప్పుడు బలవంతము సేయుదువో యప్పుడు నీశిరము శతధాభిన్నమై పుడమిని బడుగాక", యని శాపోదకము విడిచెను. పిమ్మటఁ బ్రియు లిర్వురు నొండొరుఁ గౌగిలించుకొని రసానందమునఁ దేలిరి.

ఈనాటక ప్రదర్శనమునకుఁ బ్రభావతియు సఖీసమేతయై వచ్చి ప్రేక్షణక మండపమున నుండి చూచుచుండెను. నలకూబరవేషమున నున్న ప్రద్యుమ్నుని సఖీజనోపదేశము వలన నామె గ్రహించెను. భద్రనటోపదేశమునఁ బ్రద్యుమ్నుఁడును నామెను గుర్తించెను.

ఆతని రూపముఁ దదనుగుణమగు విద్యాచాతురియుఁ గనులఁ జూచి గొనుచుండిన ప్రభావతి కుత్కంఠ పెరిఁగి యతఁడు తన కెట్లు లభ్యుఁ డగునా యని సందేహింపఁ గలహంసిక, భద్రనటుఁడు 'తన విద్యాప్రభావమునఁ

ప్రద్యుమ్నునిఁ దెప్పింతు' నన్న వాక్యము స్మృతికిఁదెచ్చి శంకానివృత్తిఁ జేసెను.

ప్రభావతి బాహ్యోద్యానమున మదనోత్సవము సేయుచుండ నాసమయమునకు భద్రనటుఁడు ప్రద్యుమ్నుఁ దోడ్కొనివచ్చి వారికిఁ బరస్పర ప్రత్యక్షాలోకన సుఖము సంఘటించి మఱియొక్కప్పుడా యుద్యానముననే సంకేతిత స్థలమునకు వచ్చెదమని చెప్పి ప్రద్యుమ్నుఁ దోడ్కొనిపోయెను నాఁటినుండియు నా యువతికిఁ గందర్పరాగము మిక్కిలిదైయొకనాఁడు ప్రియుని రాకకై సంకేతమ్మున సఖీ సమేతయై వేచియుండ భద్రుఁడు ప్రద్యుమ్నుని దోడ్కొనివచ్చెను. ఆ సుముహూర్తమున నే మన్మథసాక్షికముగ వారికి గాంధర్వ వివాహమయ్యెను వజ్రనాభుని తమ్ముని కూఁతులగు చంద్రవతీ గుణవతులకు గదసాంబులు భర్తలైరి ఈ సంఘటనము ప్రభావతీ ముఖమున జేరిగెను.

ఇఁక వజ్రనాభుని వధయే యవశిష్టము. అతఁడును స్వర్గ విజయ యత్నములు సలుపు చుండెను 'ఆదానవుఁ డెప్పుడు సురలోక విజయోద్యోగి యగునో యప్పుడు కుమారుఁ డాతని వధింపవలె' నను కృష్ణుని యాదేశము కలదు గనుక ప్రద్యుమ్నుఁడు సపరికరుఁడై ప్రకట సంచారుఁడై వర్తింపఁ దొడఁగెను. అంతఃపుర రక్షకు లాతని గనిపట్టి వజ్రనాభునితో విన్నవింప నతని నిగ్రహించుటకు రాక్షసరాజు సైన్యములఁ బంపెను వారెల్లఁ బ్రద్యుమ్నుచే మడిసిరి అంత వజ్రనాభుఁడు తానై యుద్ధమునకు దిగెను వారికిరువురకును ద్వంద్వ సంప్రహారము జేరిగెను ఒకరి కొకరు తీసిపోక పోరాడుచుండ సునాభుఁ డన్నకు సాయము రాఁగా గదుఁడు ప్రద్యుమ్నునకుఁ దోడై వచ్చెను ఆవల సాంబుఁడు తన్నెదిరిన దానవ సైన్యములఁ జెండాడ సాగెను ప్రద్యుమ్నుఁడు వజ్రనాభుని సుదర్శనాస్త్రమునఁ ద్రెళ్లనేసెను సునాభుని శిరము గదుఁడు ఖండించెను సైనికులందఱును హతులైరి అంత దేవతలు పుష్పవృష్టి కురిసిరి ఈ యుద్ధమును శ్రీకృష్ణుఁడు నారద సహితుఁడై యాకాశమున నిల్చిచూచుచుండెను. తుదకుఁ గుమారవిజయమునకు సంతసించి వారి నాశీర్వదించి యభినందింపఁ గృష్ణుఁడు భూమి కవతరణము సేసెను. కుమారులును బ్రత్యుద్గతులై నమస్కరించిరి. ఈ యామోద సమయముననే ప్రభావతీ చంద్రవతీ గుణవతులు కుమారులఁ గనిరని వార్త వచ్చెను. సంపదలు సానుబంధములు గదా! అంత వజ్రనాభ పురమునకుఁ బ్రద్యుమ్ను నభిషేకము చేసిరి

హరివంశమే యీనాటకమునకు మూలమనుట కించుకయు సందేహము లేదు. ఈగాథ హరివంశమునఁ దక్క నేనెఱిఁగిన మఱియే యితర వైష్ణవ పురాణముల యందును లేదు. భాగవతమున లేదు. విష్ణుపురాణమున లేదు.

అంతదూరమేల ? హరివంశములోనివే కొన్ని శ్లోకములీనాటకమునఁ గలవు. అంతకంటె వేఱు నిదర్శన మేల ?

ప్రాయికముగాఁ బురాణములు గాథా ప్రధానములును ధర్మోపదేశకములును నగుటఁజేసి వానియందుఁ గావ్యతా గుణము కొంత వఱకుఁ గొఱవడి యుండుట సహజము. అందును దత్కథలయందుఁ గొన్నిట నంగ ప్రత్యంగ భావము బొత్తుగానుండదు. అందుచేతనే యెన్నో యసమంజసములు నసందర్భములు దొర్లుచుండును. కావ్యవిమర్శ సూత్రములు పురస్కరించుకొని పురాణ గాథలను విచారింపఁ బూనుట వ్యర్థ ప్రయత్నమే యగును. అట్లని వానిలోఁ గవిత్వముండదని కాని రసముండదని కాని శబ్దార్థముల సాహిత్య ముండదని కాని నా యభిప్రాయముకాదు. ముఖ్యముగా నసంగతములగు విషయములు పెక్కులుండు ననియు వస్తు సన్నివేశ మఖండముగా నుండ దనియు మాత్రమే నాతలంపు.

సంస్కృత పురాణేతిహాసముల భాషాంతరీకరణ మొనర్చిన తెలుఁగు కవులు మూలముల యందలి యనౌచిత్యములను బరిహరించియు సంస్కరించియుఁ దమ గ్రంథములఁ నుచితరీతిని రచించిరి. గనుకనే వారు కేవల మనువాదకులే కాక స్వతంత్రు లనిపించుకొనిరి. అందును నౌచితీ సంపాదనము కవిత్రయము వారికిఁ బ్రథమ లక్ష్యము. వారిలోను గవిబ్రహ్మ రచన కది జీవగఱ్ఱ. శ్రీహర్షు నంతవాని నైషధ చరిత్రయను బ్రసిద్ధ కావ్యమును దెనిఁగించుచు శ్రీనాథుఁడుఁగూడ 'నౌచిత్యం బాదరించియు ననౌచిత్యంబుఁ బరిహరించియు'' శృంగార నైషధమును వ్రాయ సాహసింపఁగా, నంతకంటెను నెక్కువ యనౌచిత్యము లుండు పురాణేతిహాసములు తెనిఁగించు మనకవులు వానిని బరిహరింప సాహసింపఁజాలరా ?

హరివంశము నందలి ప్రస్తుత కథలోఁగూడ నట్టి యసంగతము లుండుట వింత కాదు. అందు,

మొదటిది :—వజ్రనాభ వధకును బ్రభావతీ ప్రద్యుమ్నుల వివాహమునకును నేమిసంబంధము ? వారి వివాహమగుచో వీని వధ జరిగి తీఱవలె నని కాని, వీనివధ జేరుగుచో వారి వివాహము జరిగి తీఱవలెనని కాని యేమేని కార్యకారణ యోగమున్నదా ? అతని యాజ్ఞలేక తత్పురము ప్రవేశింపరాదు, గనుక ప్రద్యుమ్నుఁడు నట రూపుఁడై యతనిచే నాహూతుఁడై యే ప్రవేశింప వలెను. సరియే. ప్రవేశము కల్గిన పిమ్మట దానవపతిని మార్కొని జయించుట కాటంకమేముండును ? ప్రభావతిని బెండ్లి యాడనిచో ఆ వధ జరుగదా ? పురాణముననిది మొదటి సందేహ పదము. అందు దీని నివృత్తి చేయునుపపత్తి కాన వచ్చుటలేదు.

రెండవది:—గద సాంబులకుఁ జంద్రవతీ గుణవతులను గూర్చి పేరు లయినఁ దెలియవు. వారు ప్రద్యుమ్నుని వలెఁ గన్యాసంసర్గాపేక్షచే వజ్రపుర మునకు వచ్చిన వారు కారు. అట్టి వారికి నదను దొరకె గదా యని హఠాత్తుగ నునాభునికూఁతుల నిచ్చి ముడివేయుట బలవంతముగఁ గతకుఁ గతకు నతుకుట. వారు ప్రభునానతిఁ బ్రద్యుమ్నునకు సహచరులై యుద్ధ మొనర్పఁబోయిరి. అచట నప్రతర్క్యముగాఁ గన్యాలాభము కల్గఁగాఁ బెండ్లియాడిరి. ఇందేమియు దొసఁగు లేదుగాని వివాహము హఠాత్సంభవ మగుటఁయొకటియే లోపము.

ఈ రెండునుఁ బ్రధానము, తక్కినవి స్వల్ప విషయములు, అందు,

మొదటిది:—ఇంద్రకేశవులు చేసిన యత్నము పరరాజ్య మస్త మింపఁ జేయుఁ గార్య తంత్రము గదా! లేశమాత్ర మెచ్చటనేని నుబ్బినఁ గార్యభంగ మగుటయే కాక మాన భంగముఁ గూడ నగునే! ఆరహస్యమును రాజనీతి ధురంధరుండగు శ్రీకృష్ణుఁడు భద్రుఁడను తేలిక మానిసి కెఱిఁగించి వాని భుజ మునఁ దత్కార్యసాధకభారము పెట్టుట యెట్టినీతి? భద్రుఁడు నటకుఁడు. ఆడియుఁ బాడియు జీవించు నతనికిఁ బెట్టినచోటుల నెల్లఁ బెండ్లియే! వాని కింద్ర కేశవులెట్టి దొరలో వజ్రనాభుఁడు నట్టి దొరయే! వానికి శ్రీకృష్ణునెడఁ బక్ష పాతముండి తీఱవలెనని లేదు. ఒకవేళ నది దేవహితము గనుకను శ్రీకృష్ణుఁడు లోకైక పూజ్యుఁడు గనుకను నిర్హేతుక పక్షపాతము కల్గినఁ గల్గవచ్చునుగాని యా సామాన్య మానవుని నుపధా శుద్ధుఁడు కాని వానిని శ్రీకృష్ణుఁడు నమ్మి యా రహస్య మెఱిఁగింపఁ వచ్చునా?

రెండవది:—వాసుదేవుఁడు వజ్రనాభ వధకును బ్రభావతీ సంసర్గమున కును బ్రద్యుమ్నునియోగించి గదసాంబులను మఱికొందఱి యాదవులను దోడిచ్చి భద్రనటుని జతఁజేసి యందఱను వజ్రపురమునకుఁ బంపెనఁట. వాసుదేవుఁడు వజ్రనాభ వధార్థము ప్రద్యుమ్నునియోగించుట సమంజసమే కాని ప్రభావతీ సంసర్గమునకు నియోగించుట బాగు గాదు. కాముక కృత్యములు దూతీముఖమున నడవవలసినవేకాని తల్లి దండ్రుల చెవి సోఁకఁ దగినవికావు. ఒకవేళఁ బ్రయోజ నాంతరముచే వారి కెఱుఁగవచ్చినను నెఱుఁగన ట్లుండఁ దగు వారేకాని తామె కొడుకును బ్రేరేచఁ దగరు. ప్రభావతీ ప్రద్యుమ్నుల వివాహము మదన సాక్షి కమే కాని యగ్ని సాక్షికముగాదు. కనుకనే కాముక వ్యాపార మంటిని. ప్రభావతీ సంసర్గాపేక్ష ప్రద్యుమ్నుని వీరకృత్యోత్సాహమునకుఁ బ్రోద్బలక మగుట లభింపఁ బోవు ఫలము మునుముందాతనికిఁ దెల్పుట యావశ్యకమే యగును గాని యది కృష్ణుఁడు తెల్పఁ దగిన విషయము గాదు.

మఱియుఁ దిర్యగ్జంతువునకు దేవ మనుష్యత్వ మారోపించుట, ప్రద్యు మ్నునకు షట్పదాకార ధారణాది నిపుణత కల్పించుట, మొదలగునవికూడఁ

గొంత యాక్షేపింప వచ్చును. అవన్నియు నలౌకికాద్భుతములు. మన గ్రంథము లన్నియుఁ దాదృశ చరిత్రలతో నిండియే యుండును. ప్రపంచమున నేసార స్వతమున నేనియు నట్టి యద్భుతములు వర్ణింపఁబడియే యుండును. వానిని దుడిచివేయ వలెననుట పొసఁగదు. తుడిచివేయుట యంతకంటెను బొసఁగదు.

ఇంతకును దెనుఁగు ప్రబంధములోని గుణోత్కర్ష తెలియుటకై హరి వంశములోని యీ లోపముల నెన్నవలసి వచ్చినది. అంతియే కాని యీ పురా ణమును నధిక్షేపించుట నామతముకాదు.

ఈకథను నాటకీకరణ మొనర్చిన రవివర్మ భూపుఁడు తన రచనలోఁ జేసిన మార్పులు పైని పేర్కొన్న లోపములలో నొక్క దానినైన సవరింపఁ జాలవు.

ఆకవి చేసిన ప్రధాన సంస్కారము శుచిముఖిపాత్రను దీసివైచుట. తిర్యగ్జంతువు మానుష వ్యాపారము సేయుట రంగౌచిత్యమునకు భంగకరమని రవివర్మ భూపుఁడు శుచిముఖిని దొలఁగించి యీ దౌత్యభారము భద్రనటుని మీఁదఁ బెట్టెను. అట్లు చేయుటచే ప్రదర్శనాను కూల్యము గలిగినమాట నిజమే కాని తొల్లిటి సందేహము మఱింత యెక్కువైనది. భద్రుఁడు కృష్ణునకు మఱింత యభ్యంతర మంత్రియైనాఁడు. అదియును గాక మగవాఁడు శృంగార వ్యాపారమున దౌత్యము సేయుటవలన నింకొక యనౌచితి దొర్లినది. కనుక నాటకమున జరిగిన మార్పు 'ముల్లుదీసి కొఱ్ఱుడచిన చేంద'మయ్యెను. రవివర్మ భూపుని రెండవకల్పన,

చిత్ర రూప దర్శనము:—ఈ కల్పన నిజముగ రసమునకుఁ బోషక మైనది. వినుకలి చేతనే నాయిక నాయకునెడబద్ధ భావయయ్యె ననుట కంటెఁ గనుకలికూడఁ గల్పించి భావమునుద్దీపింపఁ జేసెను గనుక నా'రాజకవి' కొంత మంచి మార్పేచేసెను. రవివర్మచేసిన మూఁడవ సంస్కారము,

రంభాభి సరణ ప్రయోగము:—హరివంశమునఁ బ్రద్యుమ్నాదులు రామాయణకథను రంభాభిసరణమును నాటకము లాడిరని యుండఁగా నాటకకర్త రంభాభిసరణమును మాత్రమే కయికొనుట యీషదౌచితీ సంపాదకమే. ఇది కొంతవఱకు సందర్భోచితముగా నున్నది.

రామాయణకథ దానవకుల దుష్కీర్తికి నిధానము. వారు దాని నాలించి తమ మూలపురుషుల పరాజయమును దుర్యశమును గన్నులారఁ గనుచు వినో దించి మెచ్చి నటులకుఁ గానుకలు కురియుదురా?

భద్రనటుఁడా కథాప్రదర్శనమున నెక్కుడు ప్రవీణుఁడై పొరపాటున దానినే యాడఁగఁజెగట్టినను వేషము రంగమునకు వచ్చినవెంటనే చండస్వభావు లయిన దానవప్రేక్షకులు వేషధారినిఁజీల్చి చెండాడరా?

ఇఁక రంభాభిసరణ నాటకముగూడ రావణ దుష్కీర్త్యుపాదకనే దానినిగూడ దానవులు సహించుట కష్టమే. అయినను నాకథ శృంగార రస ప్రధానముగనుక ప్రస్తుత ప్రభావతీ భావమునకుద్దీపక మగుటకు భద్రుఁడు దాని నాడించెనని సమాధానము కుదుర్చుకొనవలెను.

ఇఁక మన తెలుఁగు ప్రబంధము నా రెండు మూలములతోఁ బోల్చి చూచితిమేని సూరనార్యుఁ డా యా లోపముల నెట్లు సవరించెనో, యసంగత భాగములనెట్లు గాఢ సంగతములుగఁ జేసెనో, యనుపపత్తికముల కెట్లుపపత్తి కల్పించెనో, తుదకు రసము నెట్లు పోషించెనో, విదితమగును. అది యద్భుతావహమైన యత్నము. ప్రబంధ కల్పన ననుసరించి వజ్రనాభువధకుఁ బ్రభావతీ పరిణయము కారణము.

ఎట్లన :—"హిమగిరి రాజకన్య పరమేశ్వరి, ప్రభావతికిఁ గలలో సుప్రసన్నయై మమతను జేరఁగాఁ బిల్చి మక్కువచే నొకకేల మేనిమురుచుఁ నీకు నొక్కమగనిఁ ఘటియించితిఁ ననిపల్కుచు సంకల్ప మాత్రతత్క్షణ సన్నిధాపితంబగు చిత్ర ఫలకంబునందు నొక్కపురుషు నత్యాశ్చర్యతర రూప లావణ్య గాంభీర్య శౌర్యాది శుంభ దఖిల గుణములఁ గొమరొందు కొమరుఁ బ్రాయము వాని వ్రాసి, యితండ నీవల్లభుండు. ప్రద్యుమ్నుఁడనియెడు ప్రభు కుమారుఁడు. 'మీకు నిద్దఱకును జనియించినట్టి పుత్త్రుఁ డీ పురినేలు నోపొలఁతి' యనుచుఁ బలికెను. అది కేవలస్వప్నముకూడఁగాదు. కొంత నిజము. కొంత స్వప్నము. చిత్రఫలకంబు ప్రత్యక్ష సిద్ధ మగుటఁ జేసి యాకల యధిక విశ్వాస యోగ్యము. అదియు వేకువ గావున నచిర భావి ఫలము."

ఆవివాహ ఫలముగఁ బ్రభావతీ పుత్త్రుఁడు వజ్రపురమేలును. అది జరిగి తీఱును. అట్లే జరుగుచో వజ్రనాభు వధ తప్పదు. ఎట్లన :—

"ఆ యింతి ప్రద్యుమ్ను జాయగాఁ బలికిన
గౌరిమాటకు బొంకు కలుగదు,
దనుజవిరోధి పుత్త్రునకు నాదుష్టదైత్యుఁడు
తనంతఁ దనూజ నొసఁగఁడు,
ప్రద్యుమ్నుఁడట్లు ప్రభావతీపతియైన
దానవునకుఁ బోరు తప్పదు,
వజ్రపురము ప్రభావతికొడుకేలుట
యసురకు జయమైనఁ బొసఁగదు."

ఈవిధముగా నా రెండు ప్రధానాంశములకునుఁ గార్య కారణ యోగము కల్గించి సూరనార్యుఁడు కథా సన్నివేశమున వెలితి లేకుండఁ జేసెను.

మఱి యింక యొకమాట. ఈ సంబంధ కల్పనచేఁ బ్రభావతి చరిత్రయుఁ గొంత చక్కఁబడినది.

ఎట్లన :—పురాణము ననుసరించి ప్రభావతి ప్రద్యుమ్ను నెడ వినుకలి చేతనే బద్ధానురాగయయ్యెను. నాటకకవి కేవలమా యుపపత్తి చాలదని కనుకలి కూడఁ గల్పించెను. అట్టి కనుకలిచేతఁగాని వినుకలిచేతఁగాని యాదవుకన్య యదుకుమారుని వరించుట సంభావ్యమా? దానవకులాంతకుఁడైన శ్రీకృష్ణుఁడు వజ్రనాభాదుల కాజన్మ శత్రువుగదా! అట్టి శత్రుకులజనితుని దూతికోపదేశమున వరించుట కాకన్య సాహసింపవచ్చునా? దూతికోపదేశముకంటెఁ బితాజ్ఞ బలవత్తరమును నవశ్యానుష్ఠేయమును గాదా! పితాజ్ఞనుగూడఁ దిరస్కరింపఁజాలు మహాకారణమొకటి వేఱేయుండినచో నామె వలపును సమర్థింపవచ్చునుగాని లేనిచో నామె పితృపకారిణి యనుటకు సందియములేదు. ఆమె స్వయంవరన్యస్తగనుక మనసువచ్చినవాని వరింపవచ్చుననియు నది తండ్రియిచ్చిన యధికారమేకాన నాకార్యము పాపము కాఁజాలదనియు నందురేమో? ఏదీ ప్రభావతి ప్రద్యుమ్ను వరించితినని తండ్రి కెఱిఁగించుటకాని యతఁడు తానిచ్చిన యధికారమేకానఁ గూఁతురు తన యిచ్ఛవచ్చినవాని నెమకికొన్నదని సంతసించి యావరునిబిల్చి కన్నెనిచ్చి వివాహము సేయుటగాని జరిగెనా? అది కాముక వ్యాపారమే కానిచో నా రహోవర్తనమేల? అది తండ్రికిష్టములేని కార్యమని ప్రభావతి యెఱుఁగును. మనమును నెఱుఁగుదుము.

ఇఁక సూరనగారి ప్రభావతియుఁ గేవల నిర్దుష్ట స్వభావురాలు గాదుగాని యంతకంటెఁ గొంచె ముత్తమురాలని చెప్పవచ్చును. ప్రభావతీ హృదయమున మోహబీజారోపణము చేసినది పరమేశ్వరి. మొదలు ప్రభావతి యా పరమేశ్వరీ వరప్రభావ జనితయే! తనపుట్టువునకు హేతుభూతురాలయిన మహాదేవత ప్రత్యక్షమై 'నీకొఅకీపురుషుని సృజించితిని. నీ బిడ్డఁ డీపురమేలు'నని యనుగ్రహించి వరమీయఁగాఁ దదాదేశము శిరసావహించి వరసిద్ధి కెదురు చూచుటయే ప్రభావతిపని. మఱియుఁ బ్రద్యుమ్నుఁడు యదుకుమారుఁడని యామె యెఱుఁగదు. పరమేశ్వరియు నా రహస్య మెఱిఁగింపలేదు గనుక మొదటఁ గులవిరోధియెడ మనసు నిల్పఁదగునా యని యామె సందేహించుట కవకాశమేలేదు. పదపడి రసభావము వెల్లివిరియు కాలమున శుచిముఖి ముఖమున నారహస్యము విన్నది. ఆ విన్నప్పుడయినను గొంత వెనుకముందులు విచారించి యాదవుని వరించుట స్వకుల హానిహేతువని మనసు మరల్చుకొనవచ్చును. కాని యామె యట్టి విచారము లేశమైనఁ జేయలేదు. అందుచేతనే ప్రబంధప్రభావతియుఁ బితృ తిరస్కారమొనరించిన పాపమునఁ బోయినది కాని కేవల నిర్దుష్టురాలుకాదు. కాకున్న మిత్ర వాక్యమును బితృవాక్యమును, దేవతావాక్యమును

గ్రమముగ నుత్తరోత్తర బలాధికములు గాన దేవతా వాక్యానుసారము వర్తించిన మన ప్రభావతి మిత్ర వాక్యానుసారము వర్తించిన పురాణప్రభావతి కంటెఁ గొంచెము నయము. మఱియుఁ బురాణప్రభావతికి భర్తృసమాగమ కాంక్షయే లక్ష్యము. ప్రబంధ యువతికిఁ బుత్రజననమును దద్రాజభావమును లక్ష్యము. ఎంత భేద మున్నదో చూడుఁడు.

లక్ష్యములఁ బట్టి వర్తనను సమర్థింపనగుచోఁ బ్రభావతి వర్తనము సమర్థనీయమే! మాతృత్వముఁ దాల్చుటయు జీవత్పుత్ర యగుటయుఁ బుత్రాభ్యుదయము చూచుటయు నేకదా స్త్రీత్వమునకు సత్ఫలములు. అట్టిసత్ఫల నిరీక్షయు దేవతావాక్య విధేయతయుఁ గారణములుగాఁ బ్రభావతి నెఱపిన పురుషకారము కేవలము దుష్టము కాదు. అయినను సూరన గారు తలఁచినచో నీ పాత్రనింకను జక్కదిద్దు నవకాశము లేకపోలేదు. ప్రద్యుమ్నుఁడు యాదవుఁడని శుచిముఖి తెలిపినపుడయినను బ్రభావతి కొంత ధర్మ సంకట స్థితిలోఁ బడుటకు నవకాశ మున్నది." కటకటా! పితృకులవైరిని నాకు భర్తగాఁ బరమేశ్వరి యెట్లునిర్ణయించె? దీనిని నాతండ్రి యెట్లు సైచును? నేను పితృభక్తి నెఱపుదునా? పతిసమాగమముఁగోరుదునా? ఒకటఁ బరమేశ్వరికిని నొకటగురునకును నవిధేయురాల నగుదునుగదా!" యని ధర్మాధర్మ విచక్షణ నెఱపి తుదకు నవశ్యంభావియగు విషయముకాన భర్తృసమాగమ యత్నము చేసిన బాగుగ నుండెడిది. అట్లు జరుగమి శోచనీయము గానే యున్నది. పరస్పర విరుద్ధభావ సంఘట్టన కల్పించి పాత్రల శోధించుట బంగారము పుటము పెట్టుట. అప్పుడు కాని వన్నె తేలదు. 'షేక్సిపియరు' నాటకములను నాంధ్రభారత గాథలను జదివిన రసికులకీ ధర్మము విదితమే. సూరనగారి కళాపూర్ణోదయమునను నట్టి ఘటనలున్నవి. ప్రభావతీ ప్రద్యుమ్నమున నట్టి రచన కవకాశ ముండియు దానిని గడపి పుచ్చుట యొక లోపము గానే గణింపఁదగును. ఆలంకారిక వచనమును బట్టి స్థాయి భావమునకు సజాతీయ విజాతీయ భావములచేఁ దిరస్కారము జరుగఁగూడదు. అది రసభంగ హేతువు. ప్రద్యుమ్ను నందుఁ బ్రభావతికి నిల్చిన రతి యను స్థాయి భావము పితృభయాది విజాతీయభావ తిరస్కృత మయ్యెనేని రస పోషణమునకు న్యూనత వాటిల్లు నని శాస్త్రవచనము. దానికి విధేయుఁడై సూరనార్యుఁడు స్వతంత్రింప లేకపోయెను. రసపోషణమునకు భంగము రాకుండఁ జేయు నెపమునఁ బాత్రపోషణమునకు భంగముఁ గల్గించుకొనెను. ఒక్క శుచిముఖి పాత్రయెడఁ దక్కఁ దక్కిన వానియెడ నాతఁ డంతగా శ్రద్ధ వహింపలేదేమో? యనియు శంక పొడముచున్నది.

మూలముల యందుఁ జంద్రవతీ గుణవతుల వివాహములకును బ్రధాన కథకును బొత్తు లేదనియు నవి మాహాత్మ్యసంభవములనియు ముందు తెల్పితిని.

ప్రబంధమున నాలోపము పూర్తిగఁ బరిష్కృతమైనది. "ఎట్టి యర్థమును దగు లోకాన దిపియక వెలిపోనిచ్చునె బుధుఁడూహించి చేయు సుకవిత్వంబుల్". తత్సంపాదనార్థము సూరనార్యుఁడు చేసిన కల్పన చిలుక రాయబారము. ప్రభావతికిఁ బ్రద్యుమ్నుతోడి వివాహము పరమేశ్వరి యాదేశించినట్లే చంద్రవతీ గుణవతులకు గద సాంబులతోడి వివాహములు నారదుఁ డాదేశించెను. అక్క పెండ్లికి హంసి దూత్యము నడపుచుండఁ జెల్లెండ్ర పెండ్లికిఁ జిలుక రాయబారము సేయుచుండెను. ఈ రెండు కార్యములును, గుడి యెడమలుగా మొదట నుండియు జరుగుచునేయున్నవి. మాతృనది పుట్టిన చోటనే యుపనదియుఁ బుట్టినది. అవి సంగమించు ప్రదేశము తీర్థభూతమైనది. ఇంకు మాహాత్మ్యంభవత లేదు. ప్రభావతివలెఁ జంద్రవతీ గుణవతులును భర్తృసమాగమకాంక్షిణులై యుత్కంఠతోనే యుండిరి. గద సాంబులకుఁగూడఁ బ్రద్యుమ్నునకువలెనే నూత్న వధూసంగమాపేక్ష యుద్ధయాత్రాప్రోద్బలకమైనది. ఒకరికిఁ దెలియకుండ నొకరు వజ్రపురీ యాత్ర "నా భాగ్యవిలసనంబ" యని "నా భాగ్యవిలసనంబ" యని లోలో మురిసిరి. ప్రద్యుమ్నుఁడు విరహార్తుఁడై దెసలకుఁ జేతులు సాఁచి "కృపనెఱిఁగింపరే కీరోత్తమములార! వజ్రపురికిఁ బోవువారె మీరు?" అని ప్రార్థనాపూర్వ దీనాలాపములు పలుకుచున్న సమయంబున నభోమార్గమున నెగురుచున్న శుకము కారుణ్యమున నిల్చి యాతని యిచ్చిన పత్రికఁ గైకొని దానిని శుచిముఖికి మోచికొని వచ్చియిచ్చుటయే యీ రెండు గాథలయొక్కయు సంగమస్థానము. పదఁపడి హంసి చంద్రవతీ గుణవతులఁ జేరి "మీపతులిట వచ్చుటకుచితోపాయము మిగులఁ దడయ కొక్కటి సేనాపాదించెద" నని వారిమైత్రి సంపాదించుటయే యవి మఱింత సన్నిహితము లగుట. రెండంశములును శుచిముఖ పోఁగునకుఁ దగుల్పడి యేక మయ్యెను.

ఇఁక భద్రనటుని విషయము. వానికి ప్రబంధమునఁ బ్రాధాన్యము లేదు. ఉండను గూడదు. ఆవిషయము పైని వివరించితిని. నటునకును వటువులకును జరిగిన సంవాదమున విశ్వంభరుఁడు వటు వచనంబు లుపశ్రుతిగఁ జేకొని తదనుసారంబున వజ్రపుర ప్రవేశంబును వజ్రనాభ వినాశంబును నతి సుకరంబులుగ మనంబున నిశ్చయించుకొనెనే కాని భద్రున కారహస్యము తెల్పలేదు. పురాణమునందువలె ప్రద్యుమ్నాదులతో వాని జేతఁజేసి పంపను లేదు.

మఱియు నిందుఁ గృష్ణుఁడు యదుకుమారులను వజ్రనాభ వధార్థమే నియోగించెనుగాని కన్యా సంసర్గరూపమైన యానుషంగిక ఫలము వారి కెఱిఁగింపలేదు. ఆ విషయమునయ్యనఘుఁడెఱిఁగియు నెఱుఁగనట్లేయుండి పితృగౌరవమును దక్కించుకొనెను. ఆ కార్యమంతయు దూతీముఖముననే నడచినది.

అదియునుగాక సూరన రామాయణగాథనుగాని రంభాభి సరణముగాని ప్రద్యుమ్నుచేఁ బ్రదర్శింపఁ జేయలేదు. ఆ కథలు దానవులకు సమ్మతములు కావనియే వానిని విడిచి గంగావతరణాది నాటకము లాడించెను.

ఈవిధముగా ననౌచితిని బరిహరించుట యసంగత వ్యాపారముల సుసంగతములుగఁ జేయుట లోనగు వస్తు సన్నివేశ చాతురిని గొనియాడిన పిమ్మట మన మీకావ్యమున విచారింపవలసిన దింకొక్క విశేషమున్నది.

## శుచిముఖీ పాత్ర నిర్మాణశక్తి.

పురాణమున శుచిముఖికి స్వతంత్రత లేదు. అందు నింద్రోపేంద్రుల యానతిని దలఁదాల్చి వారు చేయుమన్న పనుల భక్తిమైఁ జేసి యెప్పటి కప్పుడు వారి కెఱిఁగించుచు వినయవతియైన పరిచారికవలె సంచరించినదే కాని తానై తల పెట్టినట్టియుఁ జేసినట్టియుఁ గార్యమొక్కటియు లేదు. ఇటఁ గావ్యముననో కథ యంతయు శుచిముఖి వశముననే నడచెను. ఆహంసీమతల్లి, యుపాయములు గానక తదన్వేషణ తత్పరులై యున్న యింద్ర కేశవుల కుపాయము లుపదేశించి గురుత్వము నెఱపెను. వారికార్యము సాధించిపెట్టి మంత్రిత్వము చేసెను. దాని ప్రౌఢగుణ వర్తనములు వర్ణించుటకుఁ గథయంతయు వివరింప వలసినదే కాని యట్టి దట్టిదని విశేషణ పరంపరఁ గురిసినఁ జాలదు. ప్రభావతీ ప్రద్యుమ్నము పేరుచెప్పి నంతనే శుచిముఖీపాత్ర మనోగోచర మగును. దానికిఁ గారణము కవి, యాపాత్రకుఁ గలిగించిన ప్రాధాన్యమే. కథలో నేది ప్రధానపాత్రయో దానినే తత్కర్త సర్వాంగ సుందరముగాఁ జిత్రించును. ఈకథలో శుచిముఖి వంటి సర్వాంగ సుందరమైన పాత్ర యింకొకటిలేదు. దాని నతిప్రౌఢముగఁ జిత్రించుటయే యేతత్కావ్యరచనా ఫలితార్థముగా సూరనార్యుఁడు తలఁచి యుండును. ఈ ప్రౌఢిమ పురాణమున లేమిఁ జేసి యిదియు మూలమునకు వన్నెఁ బెట్టిన విషయములలో నొకటిగ భావించవలెను.

శుచిముఖి కార్యరంగమునఁ బ్రవేశించు నప్పటికిఁ బను లేముఖమున నున్నవో, యే వెంట నడచుచున్నవో విచారింతము.

ఇంద్రుఁడు ద్వారకకేఁగి శ్రీకృష్ణునితోఁ దన పడిన బన్నములు విన్నవింప వాసుదేవుఁడు "ఆ దుష్టరాక్షసుని సాధించుటకుం బ్రయత్నము తగం గావింత మేకాగ్రతన్."

"నీవు నుపాయాన్వేషణఁ గావింపుచునుండు మల్పకార్యంబదిగా
దేవరవునఁ దత్పురి చొరఁ గావలయునొ, యెవ్వరొర్వగలరొ వానిన్."

అని యుపదేశించి పంపెను. పదఁపడి.

"వనజాక్షుం డపు డింద్రకార్యము దెసన్ వర్తిల్లు చిత్తమ్ముతో
ననిశిన్ వజ్రపురంబు సొచ్చుట కుపాయాన్వేషివైయుండి."

వటువాక్య క్రమంబంతయును నిజాపేక్షకు నుత్తరంబుగ గ్రహించి దాని నుపశ్రుతిగఁ జేకొనెను. వటువాక్యములవలన శ్రీకృష్ణుఁడు గ్రహించిన విషయము నటవేష ధారుఁడై తనపక్షమువాఁడు వజ్రపురము ప్రవేశింప వచ్చు ననుటయే కాని తత్ప్రయోజనంబున కరుగ నర్హుండెవఁడో యతనికిని స్ఫురింపక విచారమునఁ బ్రవర్తిల్లెను.

ఇఁక నింద్రుని విషయము. ఇతఁడును గార్య భారమంతయును వాసుదేవునిమీఁదనే పెట్టి యూరకొనక స్వవిషయము గనుకఁ దనచేతనైన యుపాయములు తానును నన్వేషించుచుండెను. వజ్రనాభుఁ డెప్పు డేమియుపాటున వచ్చి పైఁబడునో యను శంకచే నింద్రుఁడు వానివర్తన లెప్పటి వప్పుడెఱుఁగఁ గోరి వజ్రపురమునకు రాక పోక లొనర్చు హంసములం బిల్చి వేగునడపఁ గోరెను.

" మాకంటె వాఁడు మునుపుగ
నేకార్యము సేయఁగలఁడొ యెఱుఁగము, మీరల్
జోకగఁ దత్పురి మెలఁగుచు
నాకే దొక పనికి వేగునడపఁగవలయున్."

"ప్రతి దివసంబు వాని నగరంబునఁ బుట్టు విశేషముల్ భవ
న్నతి పస నన్నియుం దెలిసి మాకెఱిఁగించుట మీ ప్రయోజనంబు."

ఇంద్రుఁడు హంసలవలన నాసించినది యీమాత్రమే. ఇఁక నాతఁడు చేయుచున్న యుపాయాన్వేషణ మెట్టిదో యెఱుఁగరాదు. అతనికిని నది మనోగోచరము కాలేదు. కేశవునకు వటువాక్యము వలన మార్గము పొడకట్టినది కాని దాని నడచు మానిసి చిక్కలేదు. కనుక నిర్జరకును భావికార్య మగోచరముగానే యుండెను. ఆ సందర్భమున శుచిముఖి కార్యరంగమునఁ బ్రవేశించి తొల్త వజ్రపురమునఁ దానెఱిఁగిన రహస్యవృత్తము నెఱిఁగించి యపేక్షిత ప్రయోజనానుకూల్యము నెఱపెను. స్వప్న కథయుఁ జిత్ర వృత్తమును గారణములుగాఁ బ్రభావతి ప్రద్యుమ్న శీఘ్రానయనంబునకు నుద్యోగంబు తద్దయుం జేయుట సంభావితంబు గావున నాయువిద కందర్పరాగము దేవకార్యమున కుపకారంబగు నని పరమోపదేశము చేసినది. ఈ యుపదేశమున కింద్రుఁ డెంత మెచ్చునో చూడుఁడు. అతని వేయికన్నులును నొక్కుమ్మడి విప్పారినవి. అర్థించిన దానికి కోటి మడుంగులు లభించినది.

"మీఁది కార్యంబునకుం బర్యాకులిత భావంబునం జేసి త్రోవఁ గానక దీనతనున్న మాకు మాపాలి భాగ్యదేవత యీవిధంబున నిన్ను నన్నిటికి నాధారంబుగా ననుగ్రహించెంగావున దేవకార్యంబు కడముట్ట నిర్వహించుటకు నీవ తక్క నొరులు నేరరు." "ఆ యిద్దఱకును శీఘ్ర సంగమం బెవ్విధంబున నగు, నది నీవ యెఱింగి సంఘటింపు"మని తన కృతజ్ఞతను వెల్లడించి శుచిముఖిని స్తుతించి

తక్కుఁగల కార్యభారమంతయు దానిమీఁదనే వెట్టి చేతులు జోడించి నిలఁబడి రాజ్యభిక్షవేఁడెను. శుచిముఖి యతనికిప్పుడు వేగునడవు పిట్టగాదు. మంత్ర ముపదేశించిన గురువు, కార్యము సాధించు మంత్రి. శుచిముఖి పాత్రమున కలంకార భూతములగుఁ బ్రధానగుణములు రెండు. ఒకటి బుద్ధివైభవము. రెండవది వాక్యవైదగ్ధ్యము. ఆహంసి వర్తించిన ప్రథమ రంగముననే యీ రెండుగుణములును విస్పష్ట శోభతో వెలుగొందెను.

హంసలు వజ్రపురమునఁ గన్యకాంతఃపురమున నొక్క సరోవరంబునఁ బరఁగు తఱి సామ్రాజ్యలక్ష్మీ సాక్షాత్కారాను కారిణియైన ప్రభావతి తాను వేకువను గన్న యద్భుత స్వప్న వృత్తాంతమును దనచెలి కెఱిఁగింపఁ దొడఁగెను. ఆమత్తకాశినుల యుత్తర ప్రత్యుత్తరంబుల వెంబడి యెఱుఁగనైన విశేషములేవనఁ బరమేశ్వరి ప్రభావతిదెస సుప్రసన్నయై చిత్రఫలమున నొకసుందరాకారుని రూపమువ్రాసి "యితఁడ నీవల్లభుండు. ప్రద్యుమ్నుఁడనియెడు ప్రభు కుమారుండు, మీకు నిద్దఱకును జనియించినట్టి పుత్త్రుఁ డీపురినేలు"నని వరమిచ్చిచేనుట. ఈ మాటలు చెవిని బడినంతనే వజ్రనాభునకుం గాలము చేరువౌట శుచిముఖి నిర్ణయించినది అట్టి నిర్ణయము చేయుటకెంత యెన్నిక నేర్పుండవలయునో విచారింపుఁడు. ఆయెన్నిక యెట్టిదో శుచిముఖియే వివరించి తెల్పెను.

'ఆయింతి ప్రద్యుమ్ను జాయగాఁబలికిన
గౌరిమాటకు బొంకు కలుగఁబోదు,
దనుజవిరోధి పుత్త్రునకు నా దుష్టదై
త్యుఁడు తనంతఁ దనూజ నొసఁగఁబోడు,
ప్రద్యుమ్నుఁ డట్లు ప్రభావతీ పతియైన
దానవునకుఁ బోరు తప్పఁబోదు,
వజ్రపురము ప్రభావతి కొడుకేలుట
యసురకు జయమైనఁ బొసఁగఁబోదు.
చిత్రఫలకంబు ప్రత్యక్ష సిద్ధమగుటఁ
జేసి యీ కల యధిక విశ్వాసయోగ్య ;
మదియు వేకువ గావున నచిరభావి ఫలము.

ప్రభావతీతనయుఁడు వజ్రపురమేలుట కింత కార్యకలాపము జరుగవలెననియు, నదియు జరిగి తీఱుననియు నూహించుటయే శుచిముఖి బుద్ధి బలఫలము.

'తనబుద్ధి నిర్ణయమున నించుకయుఁ బొరపాటులేదని చాటుటకో' యన 'దేవేంద్ర ! నీవెంచి తెలిసికొను' మని హంసి పన్నిదము చఱచినట్లు పలికినది. ఎన్నిహంస లాస్వప్నకథను వినియుండలేదు ? అందొక్క దానికేని యీ కార్య

కారణ ప్రపంచము గోచరించెనా ? వాని కాబుద్ధి ప్రకాశము లేదు. శుచి ముఖిది యచ్ఛపుబుద్ధి. దాని కగమ్యములు లేవు. కనుక స్వప్నమునకు వ్యాఖ్యా నము సేయుటయే హంసియొక్క మతిపసకు నిదర్శనము.

మఱియు శుచిముఖి తనభర్త పంపున శతమఖునకు వార్త విన్నపంబు సేయునదియై వచ్చి యభిముఖయై నిల్చి ప్రసంగించుటకు దొరకొనుటతోనే యెంతవచన సారస్యము కురిపించినదో చూడుఁడు. వచ్చిన మొగముననే తానెఱిఁ గిన విషయమును రెండు మూడు పొడిముక్కలతో నెఱిఁగింపరాదా ? అదిసీరస పద్ధతి. శుచిముఖివచన రచనా ప్రక్రియ రసమయము. నిపునగరము చేరెడి తమ్ము నింద్రు డనుమానింపకుండునట్లు మునుముందు క్షమాపణవాక్యము విన్న వించినది. పిమ్మట 'నటుచనక హంసములకు మేఁత నడచునే' యని తమ వర్తనమునకు నుపపత్తి కలిగించి నిర్దోషతచూపినది. పిమ్మట కథనందుకొని పూసగ్రుచ్చిన ట్లీయర్థమును వెలిపుచ్చకుండ, 'బుధుఁడూహించిచేయు సుకవి త్వము' వలెఁ, జెప్పినది. ఆకథా కథనమునందుఁగూడ శబ్ద సంస్కారము జాఱ నీక పునరుక్తిదోషంబు పొంతఁబోక ప్రకృతార్థభావంబు పాదుకొ నదుకుచు నుపపత్తి యత్యూర్జితముగఁ బూర్వోత్తర విరోధమొదవకుండ బహు తపఃఫల మైన తనపలుకు నేర్పును వెలయించినది. బృహస్పతి ప్రముఖమహర్షి సంవాదము లాలించు దేవేంద్రునకుఁగూడ దాని వచనరచనావిచక్షణత్వంబు చిత్తంబునకుఁ గ్రొత్తయింపు సొంపు సంపాదింప నతఁడు "ఓ వరటామణీ ! విహంగయోషవే ? భాషాప్రావీణ్యముచూడ వాగ్దేవతవో ? కాక యాకె దిద్దిన కవివో ? " యని మెచ్చుగొల్పు పల్కులు పల్కెను. ప్రసక్తమైనది గనుకఁ దనపూర్వం బెఱిఁ గింపక మానరాదనియు నట్లెఱిఁగించుటయు మన్ననకు హేతు వగుననియు నూహించి శుచిముఖి,

"విను సురేంద్ర ! పద్మజుని తేరుఁదివుచు సా
రంధ రాఖ్యుఁడగు మరాళవిభుని
బిడ్డనేను వాణిపెనుపంగఁ బెరిఁగి త
ద్విమల శిక్షఁగంటి విద్యలెల్ల "

నని పూజ్యపాదులయిన తన గురుజనులఁ బేర్కొని తన గొప్పఁదనము నింద్రునకు వ్యంగ్యప్రధానముగాఁ దెల్పెను. ఎప్పటికెయ్యది ప్రస్తుతమో యప్పటికది సరసముగా మాటలాడి యెదిరి హృదయముఁ జూఱగొను నేర్పరి తనమే శుచిముఖి వాక్కునకుఁ దొడవు.

పిమ్మటఁ దానెఱిఁగిన విషయము చక్రికి విన్నవించునదై శుచిముఖి యింద్రునిపంపున ద్వారవతికేఁగెను. అప్పట్ల శ్రీకృష్ణుఁ డష్టమహిషీ సహితుఁడై

యాల యోపవన సరస్తీర మండపవర్తియై యుండెను. హంసి యతని దవుదవ్వుల విలోకించి తెలిసి 'యితని నెఱిఁగించుకొనవేళ యిదియ యనుచుఁ దానొక్కతయె రక్కసులగొంగ చెంగటికి నల్లనల్ల నడచి 'నీకొక్కమాట చెప్పఁగ నన్నమర విభుఁడు పనిచెను. అదియేకాంతపుఁబ"ల్కని విన్నవించెను. కృష్ణుఁడు సతీసమేతుఁడై వినోదించు సమయమే తగిన యదనని గ్రహించుట హంసీమణి యొక్క సమయజ్ఞతకు గుర్తు. మఱియు నదరు బెదరు లేక నిబ్బరముగ లోకనాయకు నంతవానిఁ గదియవచ్చి "నీకొక్కమాటఁ దెల్ప నన్నమరవిభుఁడుపనిచె" ననునప్పటి దానిదిట్టతన మవరోధ జనమున కరుదయ్యెను. మఱియుఁ దన తనయుఁడు రాతనుపైఁ జనియెడు నని రుక్మిణికి నసమ్మతమగునో యను శంకఁ జేసి హంసాంగన యేకాంతపుమాట గలదని చెప్పెను. ఈ యుత్తరార్థము కృష్ణుఁడూహించెనో లేదో కాని తత్పూర్వవాక్య క్రమముచేతనే యాపులుఁగుపడఁతి యొక్క మాటనేర్పును బుద్ధికౌశలమును మెచ్చి యేకాంతమిచ్చి దాని ప్రసంగము విని,

"వడుగుల పల్కుపశ్రుతిగ వారకమున్ను సునిశ్చితత్వముం
బడసిన కార్యపద్ధతికిఁ బక్షి వధూవచనక్రమంబుచేఁ
గడమ సమర్పితంబగుడుఁ గంజదళాక్షుఁడు సంతసిల్లె, నే
ర్పడియెను వజ్రనాభవధ భారవహుండిపుడంచు నాత్మలోఁ"

కృష్ణునకుఁ గూడ నుత్తరకార్య పద్ధతి స్ఫురింపకాలోచనా మగ్నుఁడై యుండుటయు నది హంసిచేతనే సమర్పితంబగుటయుఁ దెల్లమే.

యదూద్వహుఁడు శుచిముఖిని నమ్మఁ దగిన బంటుగా నాత్మీయగా భావించి కాఁదగిన రహస్య కార్యక్రమ మంతయు నెఱిఁగించి ప్రద్యుమ్నుపై దితిసుతునకు వేడ్కపుట్టంగఁ జెప్పి యవ్వీడు చొరఁగ ముసలఁగొను, మాతఁడై వచ్చు మదనుఁడంత' నని యొక ప్రయోజనము నిర్దేశించెను. దాని నుపయోగింపఁ దగిన యవాంతర కృత్యములుఁ దత్తదుపాయంబులాయన యెఱిఁగింపలేదు. "అవన్నియు నీవ యెఱుంగుదు. పొమ్మని" తనకు దానియెడఁ గల పరమవిశ్వాసమును, నెఱుఁగఁజెప్పెను. భారతోద్యోగ పర్వమునఁ గృష్ణుఁడు రాయబారమునకేఁగుతఱి నిట్టిదే ధర్మజునివాక్య మొకటియున్నది. "పొమ్మెవ్వఁడ నీకు నేను బుద్ధులుసెప్పఁగ" అని యుధిష్ఠిరుఁడు కృష్ణునుద్దేశించి పల్కిన పల్కది. ఆసందర్భమునఁ బాండవుఁడు తన్నెంతగా నమ్మి తనపై నెంత భారముంచి యాత్మార్పణము గావించెనో యీసందర్భమునఁ గృష్ణుఁడును హంసి నంతగానమ్మి దానిపై నంత కార్యభారముంచెను.

హంస లాకాశమార్గమున మరలిపోవునెడఁ బ్రద్యుమ్నుఁడు కానవచ్చెను. జేరుగనున్న వీరశృంగార కార్యములకు మూలభూతుఁ డతఁడే కాన నతని హెచ్చె

రించి ' మనను లోఁయరసి పోవలె ' నని శుచిముఖి ' అల్ల యతఁ డితండ కావలయు నవశ్యమీ వరపురుషుతో మాటలాడి చేనుట మనకు మే ' లని యతనికి వినఁబడునట్లుగఁ దోడి యంచలతోఁ బల్కి యతనికి వెఱఁగు గల్పించి ధరణికి డిగెను.

నిజమారసిన, బ్రద్యుమ్ను వజ్రపురమునకుఁ బంపు భారము కృష్ణునిదేయయ్యుఁ గంటఁబడిన ప్రధానవస్తువు నొరసి చూడక యూరక పోవుటేల ? యని శుచిముఖి పన్నిన కల్పన యిది. అందును దాను చెప్పఁదలఁచిన విషయమునెడ నతికుతూహలము కల్గుటకై " అల్ల యతఁడితండ కావలయు " నన్నది. ఈప్రౌఢత్వము వర్ణనాసీమ నతికరించెను. పదపడి యాతఁ " డిచ్చట నెవ్వనితో నేమి మాటలాడవలయు నతనిం బిలిచి సంభాషింపుఁ " డన శుచిముఖి యఖిలజన మనోహరంబైన మధురస్వరంబునఁ జెప్పఁ దొడఁగెను. శుచిముఖి వాక్యము లతినిపుణములే కాక మధురములనియు భావింపవలెను. ఆవిశేషమును గవి పెక్కుచోటులఁ గొనియాడెను.

" సహజ మాధురీ ధురీణ వాణీ రామణీయ
కంబు, కార్యకమనీయంబున నినుమడించి
బిడౌజు నిబిడౌజుఁ జేయుచుండ నిట్లనియెను. " 1. ఆ. 129. ప.

" శుచిముఖి యఖిల జనమనోహరంబయిన
మధురస్వరంబున నిట్లనియె. " 2. అ. 43. ప.

" అంత నంచే చెలువ చెలువంపుఁజెలువు
గులుకు కలికిపలుకు కలకలంబు వీనుల
కపూర్వపర్వంబగుచుఁ బర్వుచుండ నిట్లనియె. " 2. ఆ, 51. ప.

" వీనులకు సుధారసముల
సోనలు వర్షించు మృదుల సుస్వరఫణితిః "

" కావ్య నాటకాలంకారగాన మదనశాస్త్ర
పరిచయ మహిమంబు జాలపాదభామినీ మణి నెఱపె. " 4. ఆ. 63. ప.

మాటనేర్పు లేని బుద్ధికుశలత వ్యర్థము. సంస్కార పూతముగాని మాట నేర్పుకూడ వ్యర్థమే. సంస్కార పూతమయ్యుఁ గాకుత్వ దూషితముగునేని యది యు వ్యర్థమే. బుద్ధికుశలతయు, సంస్కార పూతమగు వాక్కును, నావాక్కు నుపయోగించు నేర్పును, దాని కనురూపమగు సుస్వరసంపన్నతయు, నొక్క చోఁ గూడి యుండుట సృష్టి కలంకార భూతము. శుచిముఖి కీసుగుణము లన్నియుఁ గలవు. ఆహంసి పెదవికదల్చిన మోహనాస్త్ర మగుట కీ గుణసముచ్చయమే కారణము.

ప్రకృత మనుసరింతము. శుచిముఖి ప్రద్యుమ్నుని శత్రుసూచనతాకుతూహలము నొరసి చూడఁ దలఁచినది. ప్రసంగముఁ దిగుచుటకు మున్నె తామింద్రకేశవుల యాజ్ఞలుధరించి యొకచోటి కేఁగుచుండుటయుఁ దమయెడ నాయింద్రోపేంద్రులుచూపు మన్ననయుఁ దాము కాశ్యపులగుటయు లోనగు నాత్మౌదార్యమును సూచించి యవి ప్రాకృతపక్షులు కావని యాతఁడుఁగూడ గౌరవింపఁ దగునట్లుగాఁ జేసినది. అప్పట్లనే " మేము మఱి యెవ్వరితోడను మాటలాడఁగా వచ్చెదమనియు, బ్రస్తుత ప్రయోజనసిద్ధికి నీ యనుగ్రహము గాంచిపోవుట మూల" మనియు మఱికొంత సూచించినది. ఏకాంత ప్రసంగ యోగ్యమైన విషయము నంతకంటె నెక్కువ చెప్ప వలను పడదు. సమయజ్ఞురాలగు శుచిముఖి కా నీతి యొరులు నేర్పవలెనా? ఏకతమునఁగూడ నతనితోఁ జెప్పిన విషయమతి స్వల్పము "వజ్రనాభుం డనియెడు నొకదైత్యుఁ జంప యత్నము సతతంబునునడచుచున్నది బహు దినములనుండియును హరికి దేవేంద్రునకున్."

"తమకంటె మున్న వాఁడే
తమ మీఁదట నేమికీడుఁ దలఁచునొ యనుచున్
మము వారు వేగఁ బంపఁగ
నమ రాహితు వీటికిప్పు డరిగెద మనఘా !"

యని మాత్రము చెప్పినదే కాని తద్యథార్థమై మీతండ్రి నిన్నే యనుప నున్నాఁడని తానెఱిఁగిన వివరమును దెల్పలేదు. అప్పటి కంతియే ప్రస్తుతము. ఎన్ని రహస్యము లయినను నుబ్బనీక పుక్కిటఁ బట్టి యుంచుటయు, సమయమగునెడ నొక్కొక్కటియే ప్రయోగించుటయు దాని నీతి. మఱియు 'సరసిజనేత్రు దక్షిణ భుజంబవు నీ'వని పల్కి భావికార్యమును గొంత ధ్వనితము చేసెను.

శత్రువధ యత్నము విన్నంతనే శంబరారి రక్తముప్పొంగి "మరుత్కంటకు వీఁచ మడఁపనె, నన్నొకనినె పంపినను దమ నియోగ బలమునన్" అని బరవసము చేసిపల్కెను. అపేక్షిత ప్రయోజనానుకూల్యము కలిగెను గనుక శుచిముఖి తలయూఁచి మెచ్చినది. కాని ప్రద్యుమ్నుఁడు ప్రభావతీ సంగమాపేక్షుఁడయిననే కాని వజ్రనాభ వధాగ్రహుఁడు కాఁడుగదా! అతని మనస్సును దత్కార్యాభిముఖము సేయుటకదియే యుచిత సమయము. కనుకనే హంసి దనుజకన్యకారూప వర్ణన ప్రారంభించి యప్రత్యక్ష విగ్రహమును బ్రత్యక్షము సేయుటకో యన నెన్నో యుపమలు నెన్నో యుత్ప్రేక్షలు కల్పించి వర్ణించినది. ఉపమాతిశయోక్తి కామధేను బిరుదాంచిత యీరీతిగాఁగాక పొడిమాటలతో వర్ణించునా? పిమ్మట పార్వతీ దత్తమైన చిత్రఫలక వృత్తాంతమును దెల్పి 'యా యాకృతి పోలుపంతయు భవదాకృతిఁ' గని 'యతఁడితండ' యనుకొంటిమి.'

అని యతనికి మిక్కుట మగు నానఁగొల్పి మఱి నిల్వక పోయి వచ్చెదమని యెగిరి పోయినది. గాలము వైచి మీన కేతుని బట్టినది.

ప్రభావతీ రాగమును బోషించుట, వజ్రనాభు మొదల సంపాదించుట, యను గార్యద్వయము శుచిముఖికి మిగిలిన కర్తవ్యము. తత్ప్రయోజనసిద్ధికిఁ బ్రభావతితోడి చెలిమి గలిగించుకొనవలెను గనుక శుచిముఖి తఱివేచి యుండెను. తఱివేచి యుండుట, తఱితోఁ దగిన మాటలాడుట, దాని నైజములు. తొందర పడి పని చేయదు, తొనఁకి మాట లాడదు.

ప్రభావతి రాగవల్లరితోఁ బ్రమదవన విహారము సల్పి తంతన్యమానకంతు సంతాపయగుచుఁ దొల్లిటి చిత్రఫలకమును దెప్పించి యక్కునఁజేర్చి సొక్కుచు నుస్సురనుచుఁ గాంతాళంబునఁ బొరలుచు విరహ భర విహ్వల యగుచుండఁగా సమీపమునఁ బొంచి యున్న శుచిముఖి. "ఇత్తన్వి చిత్తంబువడసి యీచెలిమి కలిమి హత్తించుకొనుటకు ననుగుణంబగువేళ యదియ యటంచు నూహించి మదిని దగు నుపాయంబు వితర్కించి యవ్వుడు యదృచ్ఛనపోలె నా తెఱవ యెదుట నల్ల నల్లన నడ్డముగ నరుగుచు సవిమర్శ దృష్టిని బలుమఱు మరలి మరలి చిత్ర ఫలకంబువంక వీక్షించెఁ గొంతసరి గడచుదాఁక నొకపింత సరణి మీఱ". ఇంత దనుక మనము శుచిముఖి యొక్క మతి పసయు మాట యింపును బలుకు నేర్పును మాత్రమే యెఱిఁగితిమి. ఇచ్చట దాని నడల గరువతనముఁగూడ సూచితమైనది. ఎంత క్లిష్టసమయమో చూడుఁడు. ప్రభావతీ రాగవల్లరులు తామై హంసిని బిలిచి యడుగుట కవకాశము లేదు. పోనీ, హంసి యేనియుఁ దానై పిలువని పేరం టముగాఁ బోయి డబ్బాటుగాఁ బ్రసంగముఁ దిగుచుట పేలవత్వము. చిత్రరూప ప్రకృతవిషయముఁ దానెఱిఁగినట్లు నటించుట, తద్వారమున వారిచేఁ బిలిపించు కొనుట యుద్దిష్టములు. ఆ యుద్దేశములు చేష్టాసాధ్యములు గాని వాక్య సాధ్య ములు గావు. ఇచట నోరువిప్పి పలుకుటకు నవకాశమే లేదు. కాలుకదల్చుట కన్ను త్రిప్పుటయే ప్రయోగార్హములయిన యస్త్రములు. ఆ యస్త్రములే శుచిముఖి గరువతనముతోఁ బ్రయోగించినది. అవియు నమోఘములయిన లక్ష్యభేదము లయ్యెను. పాత్రము సమగ్రసుందర మగుటకు నాకారేంగిత చేష్టాదులన్నియు ననురూపములుగ నుండవలెను. ఒకచోఁ గొఱఁతవడిన నంతయు వికృతమే యగును. ఈ శుచిముఖి పాత్ర సర్వాంగ సుందరమునుటకో యనఁ గవి దాని చేష్టల సొంపును వర్ణించినాఁడు.

శుచిముఖి తిరిగి తిరిగి ఫలకముపైఁ జూడ్కులు పఱపుటచే దానికే మేని తల్లిఖిత పురుషవర్యు వివరము తెలియునేమో యని ప్రభావతికాన పొడమి యా మాట చెలితోనన్నది. ఆ పలుకు తన్నుఁ గూర్చి పలుకుటయే గనుక హంసి యామాట యందుకొని తానాచిత్రంబు నబ్బపడి చూచుటకుఁ గారణము

వినుమని 'మున్నొకచోట నొక్క పురుషుంజూచి, తత్సమాన రూపుని మఱి యెందునుం గానక యిప్పుడిందు నతనికై వడిఁ దోఁచిన నిది తదీయ రూపంబెఱింగి వ్రాసిన తెఱంగో యట్లుగాక యట్టివాఁడే వేఱొక్కఁడెక్కడనైనం గలిగెనో యని యించుక విమర్శించి వీక్షించితి' నన్నది. ఈ మాట లెంత యుదాసీనములో తిలకింపుఁడు 'ఇట్టి మనోహరాంగుఁ డొకఁడెందైననుఁ గలఁడాయనియుఁ, గలిగెఁబో యాతని కందువ యెఱిఁగిన వారెవ్వరా యనియు సందియమునఁ గుందుచున్న ప్రభావతికి హంసీవాక్యములవలన నట్టివాఁడొకచోఁ గలఁడనియు నతని కందువ హంసి యెఱుఁగుననియుఁ దెలిసినది గనుక నాపడఁతి యద్భుతప్రమోద నందేహంబులు డెందంబునఁ గ్రందుకొనుచుఁ గండిలింప, "ఓ హంసీ! నీవు మహాత్మవని తోఁచెను. ఇటురమ్మా. చక్కఁగా నీక్షించి యారూపును నీరూపును నొకటియో విభేదము కలదో తెల్పు" మని బతిమాలెను "ఇర్వురేకతమాడుచోటికిఁ బిలువక చేర నే వెఱ్ఱినా" యని బెట్టుచేసి శుచిముఖి దూరముగానే నిలిచినది దాని గరువతనంబులాగు దాని కఱదలు నరుదులని వెంటనే రాగవల్లరి గ్రహించినది. రాగవల్లరియు గరువతనంబుల ప్రోడయే అసలుగుట్టు తెల్పక శుచిముఖిని వంచించి కావలసినమాట విని కడపిపుత్తమనిభావించినది. ఆ గుట్టు తానెఱిఁగినదే యయ్యు వారినోటఁ దెల్పించుకొని వేఁడించుకొని మనసు లోఁగొనికాని కావలసినమాట తెల్పఁగూడదని శుచిముఖి పై యెత్తు వేసినది. పాత్రముల గుణాగుణములు ప్రతియోగవశమునఁగాని స్పష్టతరములును బ్రకాశములును గావు ఇచట శుచిముఖి గరువతనమునకును రాగవల్లరి గరువతనమునకును బ్రతియోగభావము సంఘటిల్లినది ఇరువురును నెత్తులను పై యెత్తులును వేసిరి రాగవల్లరి యాటకట్టినది. శుచిముఖి జయించినది. దాని ప్రౌఢత్వము నికషోపల పరీక్షితమై శుద్ధమని తేలినది ప్రభావతీ రాగవల్లరుల గుట్టంతయు శుచిముఖి యెఱిఁగినదే పాపము! వారి కాసంగతి తెలియకవీపు కానరా దాఁగురు మూఁత లాడఁదొడఁగిరి. 'ఇట్టివాఁ డెందును లేఁడు, కలఁ' డని యిప్పుడుచును నేనునుఁ బన్నిదంబు చఱచినారము. ఈదండకు వచ్చి నిచ్చలంబుగాఁ జూచి నిశ్చయించి చెప్పుము" అని రాగవల్లరి హంసిని వంచింప నెంచినది. పందెము తీఱుటకు మీకు నాచే వినవలసిన యర్థమెంతయో యంతమాత్రము వినిపింతు వినుఁ' డని శుచిముఖి "వివరింప నతని రూపము యానానది, యిందు సందియములే" దనెను రాగవల్లరి మహత్తరమోద విశేషసంభ్రమంబునఁ బఱతెంచి యప్పులుఁగు ముద్దియ నెత్తికొని పలువిధములఁ గొనియాడెను నిజముగ రాగవల్లరి సంతోషకారణము ప్రతికృతియొక్క ప్రకృతి జగత్తునఁ గలదని వినుటచేతఁ గలిగినది. కాని యాసంతోషము పందెము గెల్చుటవలనఁ గల్గినదిగా మఱికొంత ప్రౌఢనటన సల్పెను. అంతమాత్రమున

నేమైనట్లు ? రుజేవడుగవలెను. పిదప నాపురుషుని కులగోత్రాదిక మడుగవలెను. ఆ కడమసంగతికూడ రాఁబట్టుటకే రాగవల్లరి శుచిముఖిని స్తోత్రపాఠములచే నుబ్బవైవఁ జూచెను. అంతఁ బ్రభావతి యతనిలక్షణము లేవైన నీ చిత్రమూర్తియందుఁ గలవా యని ప్రశ్నింప హంసి యా రుజోవును జెప్పినది. కాని తల్లక్షణ కథనంబుచేత శంబరారియనియు రతివల్లభుఁడనియు విశేషములే తెల్పినది కాని 'ప్రద్యుమ్నుఁ' డను నామము దెల్పలేదు. ఏమన నెవ్వరెంత మనసిచ్చి వచించిరి తాను వారితో నంతమాత్రము ప్రతిభాషణ సల్పుట యుక్తము. అంతతో నిల్వక వారినింకను లోఁగొను కోర్కెమైఁ బోయి వత్తునని గగనభాగమున కెగయఁజూచెను. ప్రభావతి నాదు చెలిమి కోడఁబడుమని ప్రార్థించి నిల్పఁ జూచెను. ప్రార్థించినదే కాని యప్పటికైనను మనసులోని గుట్టు తెల్పలేదు. ఈ లోపుగఁ బ్రస్తుత మేమిచేయఁదగునో యని రాగవల్లరి కొంచెము తలపోసి చూచి హంసినెట్లును మాటల గెలువరాదని గ్రహించి తమ యోటమి యొప్పుకొని యా యీమద్రహస్యమును బయటఁ బెట్టినది. అంత శుచిముఖ వచన వక్రత చాలించి ప్రద్యుమ్ను నన్వయాది కథనముచేసి " త్వమేవశరణం, గతి రన్యానాస్తి " యని రాగవల్లరిచే వేఁడించుకొన్నది.

మొదలు ప్రభావతివలపు స్థిరరూపము తాల్చినదో లేదో మనసు లోఁతు తెలియఁగోరి " రతి కాంతునిఁ దేఁగల నన రాదు. సిద్ధగంధర్వాదులలో నెవ్వనినైనను గోరికొనుము. అవశ్యముఁ దెచ్చెద " నని శుభముఖ యాకన్నె నింకొక శుద్ధికిఁ దార్కొల్పెను. ప్రభావతియుఁ దన గాఢానురాగము తేటపడు నట్లుగాఁ బలుకుటయు హంసి సంతసించి 'నీవు నమ్ముము. ఏ నిదే భవదీశుఁ దెత్తు' నని పంతము పల్కి యంతతో నూరకొనక ప్రభావతి మనసూఱట చెందుటకును, నాశ యినుమడించుటకునుఁ గాఁబోలు 'దైవ నియమంబును గల'దని దేవతారహస్యాత్మకమైన యొక యుపాఖ్యానము కల్పించి చెప్పినది. ఆ కథలోఁ బ్రద్యుమ్న శబ్దమునకుఁ గామశబ్దము పర్యాయ పదమన్న జ్ఞానము రాగవల్లరికి లేమి చూపి చెప్పి 'మాటలనే కాక పాండితియందును నీవు నన్నుఁ గెల్వరాదు సుమా ! యని యా కన్యాసఖికిఁ బుద్ధిచెప్పినది.

తరువాతిది చిలుక రాయబారము బయలైన ఘట్టము. శుకపక్షంబుల లోననుండి తదతి క్షోభంబునంజాటి పత్రికపడ్డక్షై తేయాధి పాంతఃపురంబు వెఱఁగంది 'హంసీ! యిదికడు విచార్యము. కొంకక యిందెవ్వరి కెవ్వరంపిరొకొ చిల్కంబట్టితే నోపుదే' యని పల్కెను.

" మాకంటె వాఁడు మునుపుగ
నేకార్యము సేయఁగలఁడొ యెఱుఁగుము, మీరల్

జోకగఁ దత్పురి మెలఁగుచు
నాకేదొక పనికి వేగు నడపఁగ వలయుఁన్.

అని పూర్వమింద్రుఁడు హంసలసాయ మపేక్షించెను. ఆ చిల్కపత్రిక మోచికొనిపోవు చిత్రచరిత్ర చూచుటతోనే శుచిముఖికి మనమునఁ గడు ననుమానము తగిలినది ఆపిట్ట వజ్రనాభునికి వేగు నడపుచున్నదేమో యని దాని యనుమానము. 'దానిని బట్టికొని నిజమారయవలె' ననియు లేనిచో స్వామి కార్యభంగము వాటిల్లుననియు దాని తలంపు. పోనీ ! పత్రిక లభించినది గనుక వృత్తాంతమెఱిఁగి యూరకొనవచ్చు ననుకొన్నను జిల్కను స్వాధీనము చేసికొనక యూరకపోనిచ్చినఁ గార్యము మఱింత చెడుటయేకాని పత్రిక దొరకిన లాభముండదు. ఒక్కక్షణములో హంసిహృదయమున నిన్నిభావతరంగములు పుట్టి ప్రభావతియొక్క యాదేశము మిషగా నా చిలుకను గూడముట్టిపారినది. దాని రహస్యములన్నియు నెఱిఁగినది. కాని యంతమాత్రమున దాని విశ్వ సింపక సునాభు కూఁతుండ్రఁ బిలిచి 'నా యెదుటను గల దనిపించినఁగాని విడువ' నని చెప్పి చిల్క యా గుజ్జెవు చూపినపిమ్మట చంద్రవతీ గుణవతులతో మైత్రి నెఱపి వారిని గూడఁ దనకు వశలఁ గావించికొని యన్నిపూసలును దన పోఁగునకే తగుల్కొనునట్లు చేసినది.

ప్రభావతి ప్రేరణమున వజ్రనాభుఁడు శుచిముఖిని రాజసభకుఁ బిలి పించి ప్రసంగించునప్పుడు దాని పాండితీ విలసనము మఱింత స్పష్టమయ్యెను. తదుపరి ద్వారక కేఁగి కృష్ణున కిచ్చుటి వృత్తాంతమంతయుఁ జెప్పి ప్రద్యుమ్నునకుఁ బ్రభావతీ విషయమంతయుఁ దెలిపి యన్నివిధములఁ బ్రారంభానుకూల్యము నెఱపి జరుగఁబోవు విచిత్ర నాటకమునకుఁ బూర్వరంగము నిర్వహించినది.

సర్వాంగ సుందరమును జిత్రవిచిత్ర కార్య కమనీయమునునైన యీ శుచిముఖిపాత్రము సూరనార్యుని సృష్టియే. హరివంశమునందలి హంసికిని, ఈ హంసికిని ప్రాథత్వమున హస్తిమశకాంతరము. కనుకనే యీ యంశమును గూడ మూలమునకు వన్నె పెట్టినవానిలో నొకటిగాఁ గైకొనవలెను.